



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 253 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 3-1-2026 పేజీలు-8 | వెల: రూ. 5.00


## అంగారక గ్రహంపై నీటి గుహలు..

- నీటి వల్ల గుహలు ఏర్పడినట్లు అంచనా
- భూమి కాకుండా మరో గ్రహంపై నీటి గుహలను గుర్తించడం ఇదే మొదటిసారి
- గుర్తించిన చైనా శాస్త్రవేత్తలు



న్యూయార్క్ -
అంగారక గ్రహం పై నీటి గుహలను చైనా శాస్త్రవేత్తలు గుర్తించారు. హెబ్రుస్ వాలీస్ ప్రాంతంలో ఆ గుహలు ఉన్నట్లు తేల్చారు. నీటి వల్ల గుహలు ఏర్పడినట్లు అంచనా వేస్తున్నారు. భూమి కాకుండా మరో గ్రహంపై నీటి గుహలను గుర్తించడం ఇదే మొదటిసారి. మార్స్ గ్రహంపై అగ్నిపర్వతాల ద్వారా ఏర్పడిన గుహలను గతంలో గుర్తించారు. కానీ రాళ్లలోని రసాయనాల వల్ల నీటి గుహలు ఏర్పడినట్లు తాజా రిపోర్టులో తేల్చారు. ద ఆస్ట్రోఫిజికల్ జనరల్ లెటర్స్‌లో ఈ స్టడీకి చెందిన నివేదిక ఇచ్చారు.నీటి గుహల ఆవిష్కరణ మార్స్ గ్రహంపై జీవం ఉందన్న ఆధారాలను స్టడీ చేసేందుకు ఊతం -మిగతా 2 లో

## మూసీ పునరుజ్జీవంతో నగరానికి మహర్దశ

### మూసీ పొడువునా ఎలిటెడ్ కారడార్ల నిర్మాణం

**నిర్వాసితులకు పక్కా ఇళ్లు కట్టించి ఇస్తాం**

- గోదావరి జలాలతో నిరంతరంగా ప్రవాహం
- మూసీ పరివాహకరంలో నైట్ బజార్‌ల అభివృద్ధి
- అంతర్జాతీయ కన్సల్టెంట్లతో ప్రణాళికలు
- డిపిఆర్ సిద్ధం కాగానే ఎమ్మెల్యేలకు వివరణ
- కొందరు కావాలనే మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- అసెంబ్లీలో మూసీ అభివృద్ధిపై సీఎం రేవంత్ వివరణ

హైదరాబాద్
మూసీ పునరుజ్జీవనంతో హైదరాబాద్ ఖ్యాతిని మరింత పెంచడంతో పాటు, మెరుగైన నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మూసీ పొడువునా గోదావరి నీటిని పారించి సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఈ క్రమంలో నిర్వాసితులకు పునరావసం కూడా కల్పిస్తామని అన్నారు. నిజాం ఎంతో ముందుచూపుతో మూసీ పొడవునా మంచి కట్టడాలు కట్టి ఆదర్శంగా నిలిచారని అన్నారు. నిజాంలు నిర్మించిన ప్రాజెక్టులే హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని అన్నారు. గతంలో జలవనరులను కాపాడుకొనే ప్రయత్నాలు జరగలేదని విమర్శించారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. గతంలో జల వనరులను కలుషితం చేశారు. కబ్జాలతో ఫాంహౌస్‌లు నిర్మించారు. వాటి డ్రైనేజీలను జంట జలాశయాలకు కలిపారు. -మిగతా 2 లో





## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్

- గన్ పార్క్ వద్ద ధర్నా..ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు
- సభలో మాట్లాడనీయకుండా మైక్ కట్ చేస్తారా
- స్పీకర్ తీరుపై హరీశ్ రావు అసహనం



హైదరాబాద్-
శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. సీఎం మాట్లాడిన తర్వాత సభలో మాట్లాడేందుకు, నిరసన తెలిపేందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. సభలో ప్రభుత్వం పెట్టే బిల్లులపై చర్చకు దూరంగా ఉండాలని నిర్ణయించారు. ఎమ్మెల్యేల ప్రవేశద్వారం వద్ద వారు ఆందోళనకు దిగారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారంటూ నినాదాలు చేశారు. అనంతరం గన్‌పార్క్ వద్దకు వెళ్లి అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. సభలో సభ్యులకు సమాన హక్కులుంటాయని.. వాటిని స్పీకర్ కాపాడాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఏడు రోజుల సభ నిర్వహణపై బీఏసీలో -మిగతా 2 లో

## నేడు కొండగట్టుకు డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్

- టిటిడి నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



అమరావతి,
ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం తెలంగాణ రాష్ట్రంలోని కొండ గట్టు ఆంజనేయ స్వామి క్షేత్రానికి కళ్యాణ్ వెళ్లనున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సహకారం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయ క్షేత్రానికి తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ నిధులు మంజూరు చేసింది. -మిగతా 2 లో




## పుతిన్ నివాసంపై డ్రోన్ దాడులు

- అమెరికాకు ఆధారాలు సమర్పించిన రష్యా
- ట్రంప్ చర్యలకు విఘాతంగా మారిన పరిస్థితులు

మాస్కో -
యుద్ధం ముగించేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇల్లే లక్ష్యంగా డ్రోన్ దాడులు జరగడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది ఉద్రిక్తతలను మరింత పెంచేదిగా మారింది. ఉక్రెయిన్ దళాలు ఈ దాడికి పాల్పడ్డాయంటూ రష్యా ఆరోపించిన సంగతి తెలిసిందే. వీటిని పలు దేశాలు ఖండిస్తున్న నేపథ్యంలో.. దాడి నిజమేనని నిరూపించుకునే పనిలో పడింది రష్యా. ఇందులోభాగంగా దాడికి సంబంధించి లభ్యమైన కొన్ని ఆధారాలను అమెరికాకు అందజేసింది. ఈ మేరకు ఆ దేశ రక్షణ మంత్రిత్వశాఖ ఓ వీడియో విడుదల చేసింది. రష్యా సైనిక నిఘా సంస్థ అధిపతి అడ్మిరల్ ఇగోర్ కోస్ట్యుకోవ్ మాస్కోలోని యూఎస్ మిలిటరీ అటాచ్ అధికారులతో భేటీ అయ్యారు. ఈసందర్భంగా కోస్ట్యుకోవ్ మాట్లాడుతూ.. దాడికి ఉపయోగించిన మానవరహిత విమానం శకలాలను తాము కనుగొన్నట్లు తెలిపారు. తమ దళాలు కూల్చివేసిన అనేక డ్రోన్లలోని నేవిగేషన్ వ్యవస్థలు చెక్కుచెదరకుండా ఉన్నాయన్నారు. -మిగతా 2 లో

## బ్లడ్‌లో తిరిగే బుల్లి రోబోలు..

- కోరిన చోటకు ఔషధం చేరవేత
- పందులపై పరీక్షల్లో సత్ఫలితాలు
- త్వరలోనే మనుషులపై ప్రయోగాలు
- హెవీ డోస్ ఇంజెక్షన్లకు ఇక చెల్లు

బెర్న్: -
రోబోల రాకతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. ప్రస్తుతం అనేక శస్త్రచికిత్సలు రోబోలే నిర్వహిస్తున్నాయి. తాజాగా స్విట్జర్లాండ్‌కు చెందిన శాస్త్రవేత్తలు సరికొత్త మినీ రోబోలను అభివృద్ధి చేశారు. శరీరంలోకి ప్రవేశించి రోగాన్ని నయం చేసే ఈ బుల్లి రోబోలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ఇవి రక్తంలో ప్రవహిస్తూ కోరిన చోటకు ఔషధాన్ని చేరవేస్తాయి. పందులపై జరిపిన పరీక్షల్లో సత్ఫలితాలు వచ్చాయని, 95 శాతం కేసుల్లో అనుకున్న చోటకే ఈ రోబోలు ఔషధాన్ని చేరవేశాయని పరిశోధకులు తెలిపారు. త్వరలోనే మనుషులపై వీటిని పరీక్షించనున్నట్టు చెప్పారు.సెకనుకు 20 సెంటీమీటర్లు..శరీరంలో ఔషధం ఎక్కడ అవసరమో కచ్చితంగా -మిగతా 2 లో





## ఢిల్లీని కమ్మేసిన పొగమంచు..

- విమాన సేవలపై ప్రభావం
- పలు విమానాలు రద్దుకాగా, మరికొన్ని ఆలస్యం
- శుక్రవారం ఉదయం నగరంలో ఏక్యూఐ లెవెల్స్ 386గా నమోదు

న్యూఢిల్లీ -
దేశ రాజధాని ఢిల్లీని దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో దృశ్యమానత గణనీయంగా పడిపోయింది. ఈ కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. విజిబిలిటీ పడిపోవడంతో ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమాన కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. పలు విమానాలు రద్దుకాగా, మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇంకొన్నింటిని అధికారులు దారి మళ్లించారు.పొగమంచు విపరీతంగా కురుస్తున్నందున విజిబిలిటీ తగ్గిపోవడంతో పలు విమానాలను రద్దు చేస్తున్నట్లు ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు ప్రకటించాయి. విమానాల రద్దుతో ప్రభావితమైన ప్రయాణికులు ఆన్‌లైన్‌లో రీబుక్ చేసుకోవచ్చని, లేదంటే డబ్బు వాపసు పొందవచ్చని తెలిపాయి. మరోవైపు రైలు సేవలు కూడా ప్రభావితమయ్యాయి.పొగమంచు పరిస్థితులకు తోడు ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో గాలి నాణ్యత -మిగతా 2 లో

## కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిందే

### రేవంత్ భాష తీరు దారుణం

- కేసీఆర్‌ను ఉరి తీయాలంటారా?
- అలా అయితే రేవంత్‌ను పదిసార్లు ఉరితీయాలి
- హరీష్ రావు బబుల్ షూటర్ మాత్రమే



హైదరాబాద్
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయంగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అలాగే పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టిన కేసీఆర్‌ను ఉరి తీయాంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కవిత తీవ్రంగా స్పందించారు. -మిగతా 2 లో



## కవిత కేసీఆర్ వదిలిన బాణమే

- అందులో అనుమానం లేదన్న కోమటిరెడ్డి
- సీఎం రేవంత్ అంటే అభిమానమని వ్యాఖ్య

హైదరాబాద్,
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ వదిలిన బాణం కవిత అని ఆయన అభివర్ణించారు. కవిత కన్ఫ్యూజన్‌లో ఉండి ప్రజలను కన్ఫ్యూజ్ చేస్తోందని వ్యంగ్యంగా అన్నారు. కవిత ఏ పార్టీలో ఉందో స్పష్టం చేయాలంటూ మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. తన తండ్రి మీద సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆమె.. హరీష్ రావు మీద చేసిన వ్యాఖ్యలపై ఎందుకు స్పందించలేదు? -మిగతా 2 లో

# మూసీ పునరుజ్జీవంతో నగరానికి మహర్దశ

మొదటి తరువాయి

నిందితులపై ఉక్కుపాదం మోపాం. డ్రైనేజీలను కూలగొట్టాం. కాకతీయుల నుంచి నిజాం వరకు నదీ పరివాహకంలోనే ప్రాజెక్టులు చేపట్టారు. వరద ముంపు నుంచి నగరాన్ని రక్షించేందుకు 1922 నాటికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ ప్రాజెక్టులు చేపట్టారు. ప్రపంచ దేశాలతో హైదరాబాద్ పోటీపడేలా నగరాన్ని నిజాంలు తీర్చిదిద్దారు. వారు చేసిన అభివృద్ధిని గత పాలకులు కనుమరుగు చేశారు. నదులను కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా మార్చారు. నగరంలోని మురుగుకాల్వలను మూసీకి కలిపారు. ఇలా కలుషితం చేయడంతో నల్గొండ జిల్లాలోని మూసీ పరివాహక ప్రజలు జీవించలేని దుర్భర పరిస్థితి నెలకొంది. ఆ పరిస్థితి నుంచి కాపాడాలని వేలాది మంది విజ్ఞప్తి చేశారని సిఎం తెలిపారు. ఈ నేపథ్యంలో మూసీ సుందరీకరణపై అధ్యయనం చేశాం. ఏడాదంతా నదిలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు రూపొందించాం. మూసీ ప్రక్షాళనకు కన్‌స్టలెంట్ కోసం గ్లోబల్ టెండర్లు పిలిచాం. 3 సంస్థలు జాయింట్ వెంచర్ కింద మూసీ పునరుద్ధరణ పనులు చేపట్టాయి. గోదావరి నుంచి 20 టీఎంసీల నీరు నగరానికి తరలించాలనే ప్రణాళిక ఉందని, అందులో ప్రజల దాహార్తిని తీర్చేందుకు 15 టీఎంసీలు, గండిపేటకు మరో 5 టీఎంసీలు తరలించేలా ఆలోచిస్తున్నామని వివరించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో సుందరీకరణపై లండన్, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్‌లలో అధ్యయనం చేశాం. ప్రపంచస్థాయి నగరాల్లో నదీ పరివాహక ప్రాంతాలను కాపాడుకొని వ్యాపార కేంద్రాలుగా మార్చారు. ఆర్థికవ్యవస్థ బలోపేతానికి ఆయా దేశాలు పోటీపడుతున్నాయి. గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధి కోసం 60వేల కుటుంబాలను తరలించారు. యూపీలో గంగా నదిని ప్రక్షాళన చేసి రివర్‌ఫ్రంట్ ఏర్పాటు చేశారు. ఆ అభివృద్ధిని భాజపా ఎన్నికల అజెండాగా మార్చారు. ఆయా రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను వ్యతిరేకించడం లేదని రేవంత్ వివరించారు. కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని విపక్ష పార్టీలోని పలువురు



కీలక నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమన్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు. ప్రజలకు నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా? అని వారిని ప్రశ్నించారు. వివరాలు చెబుతుంటే నొప్పి ఎందుకు మీకు అంటూ విపక్ష సభ్యులపై ఆయన మండిపడ్డారు. మూసీకి అడ్డంగా పడుకుంటామంటున్న వారు..మొన్న వర్షాలు వచ్చినప్పుడు ఎక్కడికిపోయారంటూ వారిని సీఎం రేవంత్ రెడ్డి కడిగేశారు. కొంతమంది తనను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారని.. రియల్ ఎస్టేట్ సైతం ఒక ఇండస్ట్రీనే అని ఆయన వివరించారు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారని పేర్కొన్నారు. రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతుందని చెప్పారు. రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుందని తెలిపారు. తెలంగాణలో మూసీ నది 240 కిలోమీటర్లు ప్రవహిస్తుందన్నారు. అనంతగిరి హిల్స్ నుంచి వాడపల్లి వరకు మూసీ ప్రవాహం ఉందన్నారు. మూసీ, ఈసీ నదులు కలిసే చోటు బాపుఘాట్ నిర్మిస్తామని.. అందుకే అక్కడ గాంధీసరోవర్ ప్రాజెక్ట్ చేపట్టామని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి జరుగు తుందని పేర్కొన్నారు. మూసీ నది ప్రక్షాళనను మొదట 21 కిలోమీటర్లు చేయాలని చూస్తున్నామని.. హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి చేస్తామని చెప్పారు. మార్చిలో తొలి దశ పనులు ప్రారంభిస్తామన్నారు. సంక్రాంతిలోగా తొలి దశ డీపీఆర్‌పై క్లారిటీ ఇస్తామని పేర్కొన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 51 కి.మీ మూసీ అభివృద్ధి చేస్తామని వివరించారు. 51 కి.మీ ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామన్నారు. మీరాలం ట్యాంక్ కూడా మూసీ అభివృద్ధిలో భాగమేనని స్పష్టం చేశారు. ఈ ట్యాంక్‌పై రూ.450 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. నదులు కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా చేశారని మండిపడ్డారు. నదీ పరివాహక ప్రాంతాల నిర్వాసితులకు ప్రత్యామ్నాయం కోరామని చెప్పారు. మూసీ నది కలుషితం కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటి నుంచి కాపాడాలని వేలాదిగా విజ్ఞప్తులు వచ్చాయన్నారు. ఏడాదంతా మూసీలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఆలయాలు, మసీదులు, గురుద్వారాలు, చర్చి నిర్మిస్తామని తెలిపారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే మూడు నెలల్లో అంచనాలు ఫైనల్ చేస్తామని ప్రకటించారు. ఏడీబీ బ్యాంకు రూ.4,100 కోట్ల రుణం ఇస్తుందన్నారు. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. డిపిఆర్ పూర్తయ్యాక అసెంబ్లీలో చర్చిస్తామని, సభ్యుల సూచనలు కూడా స్వీకరిస్తామని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. మీ నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి కావాలో చెప్పాలని సూచించారు. పేదలకు మంచి ఇళ్లు కట్టించి వారికి మెరుగైన వసతులు కల్పిద్దామని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. తాము మంచి పని చేయాలనుకుంటున్నాం? మీ సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. డీపీఆర్ సిద్ధమయ్యాక ఎమ్మెల్యేలందరికీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి సలహాలు తీసుకుంటామని గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## పుతిన్ నివాసంపై డ్రోన్ దాడులు

మొదటి తరువాయి




వీటిని తమ ప్రత్యేక నిపుణులతో పరిక్షించగా.. డ్రోన్ల దాడి లక్ష్యం నోవ్‌గొరొడ్ ప్రాంతం లోని పుతిన్ నివాసమేనని నిర్ధరణ అయ్యిందన్నారు. ఈ సందర్భంగా ఆ వివరాలన్నింటినీ కోస్ట్యుకోవ్ అమెరికాకు అప్పగించారు. ఇక, ఉక్రెయిన్ ఈ దాడి చేసిందంటూ రష్యా చేస్తున్న ఆరోపణలను ఆ దేశం ఖండించింది. నాటో దేశాలు కూడా మాస్కోకు మద్దతివ్వలేదు. మరోవైపు కీవ్ దాడికి యత్నించినట్లు ఎలాంటి ఆధారాలు లేవని యూఎస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కూడా వెల్లడించినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో దాడి ఆధారాలను రష్యా అమెరికాకు ఇవ్వడం గమనార్హం. ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం ముగించడానికి చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఈ దాడితో అమెరికాకు కూడా మింగుడుపడడం లేదు. ఇది ట్రంప్ తీసుకున్న చర్యలకు విఘాతంగా మారనుంది.

## ఢిల్లీని కమ్మేసిన పొగమంచు..

మొదటి తరువాయి

సూచిక కూడా చాలా పేలవమైన వర్గంలో నమోదైంది. శుక్రవారం ఉదయం నగరంలో ఏక్యూఐ లెవెల్స్ 386గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. 26 ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో గాలి నాణ్యత వెరీ పూర్ కేటగిరీలో నమోదైంది. అత్యధికంగా ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 423గా నమోదైంది.

## బ్లడ్‌లో తిరిగే బుల్లి రోబోలు..

మొదటి తరువాయి

అక్కడికే ఔషధాన్ని చేరవేయడం సవాలుతో కూడుకున్నది. ఇందుకు మెరుగైన పద్ధతుల కోసం శాస్త్రవేత్తలు ఎప్పటి నుంచో పరిశోధనలు చేస్తున్నారు. ప్రస్తుతం చాలా వ్యాధులకు ఎక్కువ డోస్‌తో కూడిన మందులు ఇచ్చి, శరీరమంతా డిస్ట్రిబ్యూట్ చేయాల్సి వస్తున్నది. దీని వల్ల దుష్ప్రభావాలు తలెత్తుతున్నాయి.ఈ సమస్యకు ఈ మినీ రోబోలు పరిష్కారం చూపుతాయని భావిస్తున్నారు. ఈ రోబోలు వాటంతట అవే నడవవు. బయటి నుంచి మ్యాగ్నెట్ ద్వారా వైద్యులు వీటిని ఆపరేట్ చేస్తారు. తద్వారా ఇవి శరీరంలో కోరిన చోటకు ఔషధాన్ని తీసుకువెళ్తాయి. వేగంగా ప్రవహించే రక్తానికి వ్యతిరేకంగానూ ఇవి ఈదగలవు. సెకనుకు 20 సెంటీమీటర్ల మేర కదలగలవు. వీటి రాకతో హెవీ డోస్ ఇంజెక్షన్ల అవసరం తప్పుతుందని వైద్యులు భావిస్తున్నారు. మనుషులపై పరీక్షలు పూర్తయితే, త్వరలోనే ఇవి హాస్పిటళ్లలో అందుబాటులోకి రానున్నాయి.

## కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిందే

మొదటి తరువాయి

కేసీఆర్ మీద సీఎం భాష సరికాదన్నారు. కేసీఆర్‌ను ఒకసారి ఉరితీయాలంటే రేవంత్ రెడ్డిని పదిసార్లు ఉరి తీయాలంటూ మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కవిత మాట్లాడుతూ.. ఈ సమావేశాలకు కేసీఆర్ వచ్చి సమాధానాలు చెప్పకపోతే బీఆర్‌ఎస్ పని ఖతం అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తప్పు చేయకపోతే సభకు రావాల్సిందే అని పట్టుబట్టారు. సభకు రాకుండా పిల్ల కాకుల మీద సభా సమయాన్ని వదలొద్దంటూ హితవుపలికారు. ఈ విషయంలో ఒక కూతురుగా తన రక్తం ఉడుకుతోందన్నారు. ఉద్యమకారుడిని ఉరితీయాలని అంటే రక్తం మరుగుతోందని చెప్పారు. శాసన మండలి వద్ద మీడియాతో ఆమె చిట్‌చాట్ నిర్వహించారు. నా రాజీనామా ఆమోదం కోరేందుకు మండలికి వచ్చాను. కేసీఆర్‌పై రేవంత్ వ్యాఖ్యలు సరికాదు. కృష్ణా జలాలపై అసెంబ్లీలో కేసీఆర్ మాట్లాడి నోరు మూయించాలి. బీఆర్‌ఎస్ మనుగడ కొనసాగాలంటే ఆయన అసెంబ్లీకి రావాలి. నదీ జలాల అంశాన్ని పిల్లకాకుల మీద వదిలేయవద్దు. బీఆర్‌ఎస్‌లో బబుల్ షూటర్లకే డిప్యూటీ ఎ÷–లోర్ లీడర్ పదవులు ఇచ్చారని కవిత వ్యాఖ్యానించారు. సొంత జిల్లా మహబూబ్ నగర్‌కు రేవంత్ తెచ్చిన ప్రాజెక్టులు ఎన్ని అని ప్రశ్నించారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావును ఉద్దేశించి కవిత మరోసారి తీవ్రమైన ఆరోపణలు చేశారు. హరీష్ రావు ఒక బచ్చా అని అన్నారు. ఆయనకు ప్యాకేజీలు తీసుకోవడం తప్ప ఏం తెలుసు అంటూ హరీష్‌ను టా÷–గ్గ÷ట్ చేస్తూ కవిత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారింది. కేసీఆర్ సభకు రాకపోతే హరీష్ రావే అన్నీ చూసుకోవడం సరికాదని.. కేసీఆర్ సభకు వచ్చి సమాధానం చెప్పాలని కవిత వ్యాఖ్యలు చేశారు.

## కవిత కేసీఆర్ వదిలిన బాణమే

మొదటి తరువాయి

అంటూ కవితను ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఇక బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. సీఎం స్పందనపై కవిత శుక్రవారం కాస్తా ఘాటుగా స్పందించారు. దీనికి కోమటిరెడ్డి ఘాటుగా స్పందించారు. తనకు సీఎం రేవంత్ రెడ్డి అంటే గౌరవమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని ఎవరు ఏమన్నా అంటే కౌంటర్ ఇస్తానన్నారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మంత్రి పదవి కోసం తాను ఏ రోజు పాకులాడలేదని చెప్పారు. మంత్రి పదవి కావాలంటూ తాను ఎవరిని అడగలేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం మంత్రి పదవినే తాను త్యాగం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తనకు, తన తమ్ముడికి మధ్య ఎటువంటి గొడవలు లేవని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జనవరి 1వ తేదీ గురువారం సాయంత్రం ప్రజాభవన్‌లో జలాలు – నిజాలు అంశంపై తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు. దీనికి కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు పార్టీలోని సీనియర్లు పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా.. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు వల్లే తగ్గిదంటూ సీఎం రేవంత్ కాస్తా ఘాటుగా స్పందించారు. సీఎం చేసిన వ్యాఖ్యలపై కవిత మండిపడ్డారు. కవిత వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.

## అంగారక గ్రహంపై నీటి గుహలు..

మొదటి తరువాయి



ఇచ్చేలా ఉన్నది. ఎన్నో ఏళ్ల క్రితమే ఈ గుహలు ఏర్పడినట్లు తేల్చారు. భవిష్యత్తు అన్వేషణలకు ఈ గుహలను స్టడీ చేయనున్నారు. 2025 అక్టోబర్ 30న ఆ అధ్యయనానికి చెందిన డేటాను పబ్లిష్ చేశారు. నాసా శాటిలైట్ల నుంచి సేకరించిన డేటా ఆధారంగా చైనా శాస్త్రవేత్తలు రిపోర్టు ఇచ్చారు.గతంలో గుర్తించిన లావా ట్యూబ్‌లతో పోలిస్తే హిబ్రుస్ వాలీస్‌లో ఉన్న నీటి గుహలు భిన్నంగా ఉన్నట్లు ఆస్ట్రోఫిజికల్ జర్నల్‌లో రాశారు.

## అసెంబ్లీ నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్

మొదటి తరువాయి



చర్చకు రాలేదని చెప్పారు. సభలో చర్చించే అంశాలను 24 గంటల ముందు పంపాలని డిమాండ్ చేశారు. తాము అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వడం లేదని ఆక్షేపించారు. నిరసనలు తెలిపేందుకు మైక్ ఇవ్వకపోవడం.. ప్రతిపక్షం గొంతు నొక్కడమేనన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో నిరసన తెలపడం ప్రతిపక్ష సభ్యుల హక్కు అని చెప్పారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఏకపక్ష వైఖరికి నిరసనగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. అసెంబ్లీ నుంచి గన్‌పార్క్ వద్దకు కాలినకడన వచ్చిన ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. స్పీకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేశారు. ఇది శాసనసభనా? గాంధీ భవనా అంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అంతకుముందు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో మూసీ సుందరీకరణ అంశంపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని వ్యాఖ్యానించారు. దీనిపై బీఆర్‌ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఎం వ్యాఖ్యలపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. కానీ అందుకు స్పీకర్ నిరాకరించడంతో బీఆర్‌ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.

## నేడు కొండగట్టుకు డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్

మొదటి తరువాయి



టీటీడీ నుంచి రూ.35.19 కోట్ల నిధులతో సత్రం, దీక్షా విరమణ మండపం నిర్మాణాలు చేయనున్నారు. ఈ క్రమంలోపవన్ కల్యాణ్ కొండగట్టుకు వెళ్లి.. ఈ నిర్మాణాల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. శనివారం ఉదయం 10గం.30ని. నుంచి 11 గం.30ని. మధ్య డిప్యూటీ సీఎం పవన్ కొండగట్టు క్షేత్రంలో పర్యటించనున్నారు. గతంలో ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న పవన్.. ముక్కులు చెల్లించుకున్నారు. ఆ సమయంలో అక్కడ నిర్మాణాలకు సంబంధించిన అంశాలను అర్చకులు పవన్ కు వివరించారు. కొండగట్టు క్షేత్రంలో నిర్మాణాలపై సీఎం చంద్రబాబుతో పవన్ సమావేశమయ్యారు. టీటీడీ సహకారంతో కొండగట్టు క్షేత్రంలో నిర్మాణాలు చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీఎం చంద్రబాబును కోరారు. చంద్రబాబు ఆదేశాలతో టీటీడీ ఛైర్మన్ తో పవన్ చర్చించారు. అనంతరం రూ.35.19 కోట్లు మంజూరుకు టీటీడీ బోర్డు అంగీకారం తెలిపింది. నిధులతో కొండగట్టు ఆలయంలో దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణాలు చేపట్టనున్నారు. ఒకేసారి 2 వేల మంది భక్తులు దీక్షలు విరమించేలా మండపాన్ని నిర్మించనున్నారు. శనివారం పవన్ తో కలిసి టీటీడీ ఛైర్మన్ బి ఆర్ నాయుడు, ఎమ్మెల్సీ హరిప్రసాద్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం , టీటీడీ బోర్డు మెంబర్లు బి.ఆనందసాయి, ఇతర నేతలు పాల్గొనున్నారు. ఆలయం అభివృద్ధి పనుల శంకుస్థాపన అనంతరం జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు, శ్రేణులతో పవన్ కళ్యాణ్ సమావేశం కానున్నారు. ఆ తర్వాత ఇటీవలి తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో జనసేన మద్దతుతో గెలిచిన వారితో భేటీ అవనున్నారు. ఈ భేటీలు, సమావేశాలు కొడిమ్యాల సమీపంలోని బృందావనం రిసార్టులో జరగనున్నాయి.

## జడ్.పి.హెచ్.ఎస్ స్కూలులో నూతన పాలకవర్గం సందర్శన









**లోయపల్లి, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లోయపల్లి జడ్.పి.హెచ్.ఎస్ స్కూలు ప్రధానోపాధ్యాయులు సాంబయ్య సార్ ఆహ్వానం మేరకు ఈ రోజు లోయపల్లి నూతన పాలకవర్గం స్కూలును సందర్శించింది. ఈ సందర్భంగా సర్పంచ్ ఆంగోత్ రఘురాం నాయక్, ఉపసర్పంచ్ బొడ్డుపల్లి నాగరాజు, వార్డు సభ్యులు అందరూ పాల్గొన్నారు. స్కూలు సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, అందరి సహకారంతో సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామని పాలకవర్గం హామీ ఇచ్చింది. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ డిమాండ్



**అమ్రాబాద్, డిసెంబర్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అచ్చంపేటలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో తెలంగాణ జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కన్వీనర్ కల్మమూల నాసరయ్య మాట్లాడుతూ, రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులు ఇంకా న్యాయం పొందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులు, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యమకారులను గుర్తించి, వారికి స్థలాలు, పింఛన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు కావడం లేదని విమర్శిస్తూ, డిసెంబర్ 29 అసెంబ్లీ సమావేశంలో, జనవరి 26 క్యాబినెట్ సమావేశంలో ఈ అంశాన్ని చర్చించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టుతామని హెచ్చరించారు. సమావేశంలో జక్క బాలకృష్ణ, కొర్ర ఈశ్వర్ లాల్ సుధాకర్, శంకర్, జేఏసీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు ఉద్యమకారులు పాల్గొన్నారు.

## ఎంపీ బండి సంజయ్ సహకారంతో గల్ఫ్ బాధితుడు విడుదల



| | | | |
|---|---|---|---|
| Family Name | ARELLY | | اسم العائلة |
| Given Name(s) | RAVINDER | | الاسم |
| Gender | Male | ذكر | الجنس |
| Nationality | INDIA | الهند | الجنسية |
| Occupation Name | | | المهنة |
| Travel Document Number | T9338140 | T9338140 | رقم وثيقة السفر |
| Travel Document Expiry Date | 21-11-2029 | 2029-11-21 | تاريخ انتهاء جواز السفر |
| Length of Stay in Oman | 30 Days | 30 يوم | مدة الإقامة |
| Number of Entries | Single | رحلة واحدة | عدد الرحلات |
| Sponsor Name | SHAAE AK HOON AL MUMYAZ | شماع الكون المميز | اسم صاحب العمل |
| Sponsor Address | مسحار PO Box: 111 PC 311 | 321 | عنوان صاحب العمل |

IMPORTANT NOTES:

- Passport must be valid for at least 6 months on entry to Oman.
- Visa can only be used for a single entry to Oman.
- Length of stay in Oman is 1 month.
- If the visitor overstays in Oman, there is a fine of OMR 10.000 for each day of overstay.
- First time Extension of Stay can be done by the applicant. Second and subsequent extensions can only be done by visiting a DGPCS office.
- Extension of stay allowed is the same as the original visa.
- Possession of a valid visa does not guarantee that a traveller will be granted entry to Oman. Entry to Oman is at the discretion of the Royal Oman Police officer at the port of entry.

ملاحظات مهمة:

**కరీంనగర్ రూరల్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గోపాల్పూర్ గ్రామానికి చెందిన ఆరేల్లి రవీందర్ ఉద్యోగ నిమిత్తం ఒమన్ వెళ్లి అక్కడ జీతాలు ఇవ్వక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. భార్య వినతిపత్రం ఇవ్వడంతో పాటు సోషల్ మీడియాలో సహాయం కోరిన వీడియో వైరల్ కావడంతో విషయం కేంద్రమంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ దృష్టికి చేరింది. రైల్వే బోర్డు సభ్యుడు పాశం తిరుపతి, బీజేపీ నాయకుడు శివారెడ్డి సహకారంతో బండి సంజయ్ వెంటనే స్పందించి భారత రాయబార కార్యాలయంతో మాట్లాడి రవీందర్ స్వదేశానికి చేరుకునేలా చర్యలు తీసుకున్నారు. తనకు సహకరించిన నాయకులు, గ్రామ మండల ప్రతినిధులు, ముఖ్యంగా కేంద్రమంత్రికి రవీందర్ కృతజ్ఞతలు తెలిపాడు.

## గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**పెద్దపల్లి, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక సమస్యలు పరిష్కరించామని, అసిస్టెంట్ ఇంజనీర్లు ఇండ్ల గ్రౌండింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నిర్మాణంలో ఇబ్బందులు ఉంటే వెంటనే పీడీ హౌసింగ్‌కు నివేదించాలని తెలిపారు. నరేగా చెల్లింపులు సకాలంలో జరిగేలా చూడాలని, పనుల వివరాలు వెంటనే నమోదు కావాలని, సిబ్బంది హాజరు ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు 45 రోజుల్లోగా ఎన్నికల వ్యయ వివరాలు సమర్పించాల్సి ఉంటుందని, లేని పక్షంలో అనర్హత వేటు పడే అవకాశం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి అభ్యర్థి వివరాలు సమర్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు అధికారులు బాధ్యత వహించాలని, ఓపెన్ ప్రదేశాల్లో చెత్త ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా ఇండ్ల నిర్మాణం జరిగితే సంబంధిత పంచాయతీ కార్యదర్శులను విధుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలకు విద్యుత్, త్రాగునీటి కనెక్షన్లు ఇవ్వరాదని తెలిపారు. త్రాగునీటి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని, వాచ్ అండ్ వార్డ్ నిధుల వినియోగం, మొక్కల పెంపకం వంటి అంశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, ఎంపిడీఓలు, అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు సరి పడే ఎరువులు అందించాలని డిమాండ్



**హుస్నాబాద్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతులకు సరిపడే ఎరువులు అందించాలని, ఫర్టిలైజర్ షాప్ యాజమానులు ఎరువులను బ్లాక్ చేసి ఎక్కువ ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకోవాలని బి ఆర్ యస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. హుస్నాబాద్ మండల వ్యవసాయ అధికారి పూజకు వినతిపత్రం అందజేసిన నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, గత వర్షాకాలంలో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారని, రోజులు తరబడి షాప్‌ల చుట్టూ తిరిగినా ఒక్క బస్తా కూడా అందలేదని విమర్శించారు. ప్రభుత్వం కూపన్ కార్డు ద్వారా ఒక ఎకరానికి రెండున్నర బస్తాలు మాత్రమే కేటాయిస్తోందని, కానీ వాస్తవానికి కనీసం నాలుగు బస్తాలు అవసరమని ఆయన తెలిపారు. యూరియా సరఫరాలో స్పష్టత లేకపోవడం, షాప్ యాజమానులు సగం బస్తాలను బ్లాక్ చేసి అమ్ముతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే బి ఆర్ యస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని మల్లికార్జున రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మల్కి రెడ్డి, మోహన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన యువకుడు



**కరీంనగర్ రూరల్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కరీంనగర్ రూరల్ పోలీసులు దుర్షేడ్ గ్రామ బస్టాప్ వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. దుర్షేడ్ గ్రామానికి చెందిన మల్లెపోగు మధు, తండ్రి చిన్న సోమయ్య అనుమతులు లేకుండా మానేరు వాగు నుండి ఇసుకను ట్రాక్టర్‌లో కరీంనగర్ వైపు తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## హామీలు నిలబెట్టుకోవడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం



**పెద్దపల్లి, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందని ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌ఛార్జి అంబాల నరేష్ మాదిగ తీవ్రంగా విమర్శించారు. పెద్దపల్లిలో మీడియాతో మాట్లాడిన ఆయన, వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్‌ను రెట్టింపు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినా, అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా పెన్షన్ పెంపు విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. పెన్షన్ దారుల ఆగ్రహానికి గురికాకముందే ప్రభుత్వం మేల్కొని, వృద్ధులకు, వితంతువులకు, గీత కార్మికులకు, బీడీ కార్మికులకు రూ.4 వేల చొప్పున, వికలాంగులకు రూ.6 వేల చొప్పున పెంచిన మొత్తాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత 20 నెలల బకాయిలను కూడా వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ చర్యలు చేపట్టకపోతే ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుందని, ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని నరేష్ హెచ్చరించారు.

## మునిసిపల్ ఓటరు లిస్టులో తప్పులు సవరించాలని డిమాండ్



**హుస్నాబాద్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రానున్న మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో హుస్నాబాద్ పట్టణంలోని ఓటరు లిస్టులో అనేక తప్పులు ఉన్నాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున కార్యాలయంలో ఓటరు లిస్టు ప్రదర్శించగా, పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు నేతృత్వంలో బీజేపీ నాయకులు 20 వార్డుల లిస్టును పరిశీలించారు. ఇందులో చనిపోయిన వారి పేర్లు, వివాహం అయి వెళ్లిపోయిన వారి పేర్లు, డబుల్ బెడ్‌రూం ఇండ్లలో నివసిస్తున్న వారి ఓట్లు పాత వార్డుల్లోనే కొనసాగుతున్నాయని, కొత్త కాలనీల్లో నివసిస్తున్న వారి ఓట్లు ఎక్కడ చేర్చారో స్పష్టత లేదని తెలిపారు. ఒక వార్డులో 1094 ఓట్లు ఉండగా, మరొక వార్డులో 800 మాత్రమే ఉండటం వంటి అసమానతలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ తప్పులను వెంటనే సవరించాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సంఘ్ ఇన్‌ఛార్జి కవ్వ వేణుగోపాల్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శులు గాదాసు రాంప్రసాద్, పోలోజు రాజేందర్ చారీ, వడ్డెపల్లి లక్ష్మయ్య, అకోజు అరుణ్ కుమార్, కోశాధికారి బుర్ర రాజు, సీనియర్ నాయకులు వెల్దండి సంతోష్, పోలోజు రవీందర్, వరియోగుల అనంతస్వామి, అశాడపు శ్రీనివాస్, నారోజు నరేష్, కాదాసు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఉప్పల శ్రీనివాస్ గుప్త




**ఎల్బీనగర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజా భవన్ లో నీటిపారదల మీద జరిగిన సమావేశం లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సరం శాంతి, సుఖసంతోషాలు, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఉప్పల శ్రీనివాస్ గుప్త ఆకాంక్షించారు.

# రెవెన్యూ అధికారులకు సూచనలు కలెక్టర్ కె. హైమావతి





**సిద్దిపేట, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లా కలెక్టర్ కె. హైమావతి రెవెన్యూ అధికారులకు ప్రజలకు పారదర్శకంగా సేవలందించి, రెవెన్యూ శాఖపై గౌరవం, నమ్మకం పెంచేలా పనిచేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ట్రేసా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె ట్రేసా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అందించడంలో ముందుండాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, ఏవో రాజ్ కుమార్, ట్రేసా నాయకులు అబ్దుల్ రహమాన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. తరువాత కలెక్టర్ దుబ్బాక మండలం లచ్చపేట గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటలో నాణ్యత లోపాలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసి, కామన్ డైట్ మెనూ ప్రకారం రుచికరంగా, సరిపడినంత వండాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్ సరిగా నిర్వహించకపోవడంతో ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని డీఈఓకు సూచించారు. ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని కూడా పరిశీలించిన కలెక్టర్, మెనూ పాటించకపోవడం, వంటగది పరిశుభ్రత లోపాలపై వార్డెన్, వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను విని, అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తరువాత రామక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అటెండెన్స్, ఓపి రిజిస్టర్‌ను పరిశీలించి, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చికిత్స పొందాలని, బలవర్ధక ఆహారం తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

# చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించాలి





## ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. సమాజహితానికి సంబంధించిన సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పాల్గొనాలని వారు సూచించారు. ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది, ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండే కార్ యాదిలాల్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. హైదరాబాదులోని ఎంపీ, ఎమ్మెల్యేల నివాసాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, కల్వకుర్తి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లక్ష్మణ శర్మ, హైకోర్టు న్యాయవాది లింగం గౌడ్, టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, కడ్తాల్ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, ఉపసర్పంచ్ ఈ రెడ్డి యాదగిరి రెడ్డి, తలకొండపల్లి పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి తదితరులతో కలిసి ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ప్రతి సంవత్సరం ప్రజల కోసం ఉపయోగకరమైన డైరీలు, క్యాలెండర్లు రూపొందించి పంపిణీ చేస్తున్న అండే కార్ యాదిలాల్‌ను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా చైతన్య కార్యక్రమాల్లో మేధావులు, విద్యావంతులు, ఉద్యోగులు, న్యాయవాదులు చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అనువైన స్థలాన్ని కేటాయించి, భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తోందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్ది రామిరెడ్డి, రాజిరెడ్డి, దస్తగిరి, విజయ్, సురేందర్ రెడ్డి, పాండు, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని సమస్యల పరిష్కారానికి ఆయుధం విద్యే

**తిమ్మాపూర్, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

తిమ్మాపూర్ సాంఘీక సంక్షేమ కళాశాలలో లీడ్ ఇండియా2047, శాతవాహన లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమంలో విద్య యొక్క ప్రాముఖ్యతను ప్రతిపాదిస్తూ మహాత్మ జ్యోతిరావ్ పూలే తెలంగాణ బిసి విద్యాలయాల సంస్థ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. నేటి డిజిటల్ యువతకు పాఠ్యాంశాలతో పాటు నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం కనీస అర్హతలుగా మారాయని, అన్ని సమస్యల పరిష్కారానికి ఆయుధం విద్య మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. మన ప్రియతమ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్థాపించిన లీడ్ ఇండియా ఉద్యమానికి మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని, ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో చదువుపై శ్రద్ధ వహించి ఎదగాలని ఆయన




సూచించారు. రానున్న రోజుల్లో అన్ని సాంఘిక సంక్షేమ విద్యాలయాల్లో ఇలాంటి వ్యక్తిత్వ వికాస తరగతులను విస్తరించాలని లీడ్ ఇండియా బాధ్యులను కోరారు. ప్రధాన వక్త లయన్ కెప్టెన్ ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ వ్యక్తి ఉజ్వల భవిత, లక్ష్య సాధనకు దినచర్య, అలవాట్లు ప్రధాన భూమికను నిర్వహిస్తాయని పేర్కొన్నారు. మంచి అలవాట్లు గమ్యానికి చేరడానికి నిచ్చెన మెట్లు వలె ఉపయోగపడతాయని ఆయన అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జనవరి 3న జరగబోయే తెలంగాణ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం వేదికగా బాలికలు తమ కాళ్లపై తాము నిలబడటానికి ఉన్నత విద్య ఉపకరిస్తుందని, మహిళల అభ్యున్నతికి విద్యే ఏకైక సాధనం అని ఆయన స్పష్టం చేశారు. గౌరవ అతిథి లయన్ వడకాపురం జగదీశ్వరాచారి విద్యతో పాటు వినయసంపన్నతను అలవర్చుకోవాలని సూచించారు. లయన్ ఎం. మహేందర్ పాల్గొన్న ఈ సభలో సభాధ్యక్షురాలు ప్రిన్సిపాల్ డా. సరితతో పాటు పలువురు మహిళా ఉపన్యాసకులను లీడ్ ఇండియా2047, శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు సముచితంగా సత్కరించారు.

# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**పెద్దపల్లి, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు పూదరి దత్తాగౌడ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో జనవరి 5వ తేదీ (సోమవారం) అన్ని రకాల వ్యాధులకు ఉచిత ఆపరేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులు కూడా ఉచితంగా శస్త్రచికిత్స చేయనున్నారు. క్యాన్సర్, థైరాయిడ్, గుండె, మెదడు, లివర్, కిడ్నీ, కళ్ళు, ముక్కు, చెవి, నరాల సంబంధిత వ్యాధులు, రొమ్ము గడ్డలు, హెర్నియా, పైల్స్, ఫిషర్, గర్భసంచి సంబంధిత సమస్యలు, చిన్న పిల్లల వ్యాధులు వంటి అనేక చికిత్సలు అందించనున్నట్లు వెల్లడించారు. ఆపరేషన్ చేయించుకునే రోగులకు ఉచిత భోజన వసతులు కల్పించబడతాయి. వ్యాధి తీవ్రతను బట్టి రోగులను రెండు నుంచి మూడు రోజుల పాటు ఆసుపత్రిలో ఉంచి మెరుగైన చికిత్స అందిస్తారు. ఈ సేవలను పొందదలచిన వారు ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ కలర్ జిరాక్స్‌తో పాటు మూడు కలర్ ఫోటోలు తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు. మరిన్ని వివరాల కోసం 9652664118 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# డబుల్ రోడ్ నిర్మాణ పనులు అక్టోబర్ నాటికి పూర్తి చేస్తాం

## - మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**మానకొండూర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గుండ్లపల్లిపొత్తూరు డబుల్ రోడ్ నిర్మాణ పనులు వచ్చే అక్టోబర్ మాసాంతం వరకల్లా పూర్తి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అసెంబ్లీలో తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇస్తూ, ఈ రహదారి నిర్మాణానికి 71 కోట్ల రూపాయలు మంజూరు చేశామని మంత్రి వివరించారు. కొండాపూర్, జంగాలపల్లి, చాకలివారిపల్లి, చొక్కారావుపల్లి, మాదాపూర్, గన్నేరువరం మీదుగా పొత్తూరు వరకు 21 కిలోమీటర్ల సింగిల్ రోడ్డును డబుల్ లైన్‌గా మార్చి స్టేట్ హైవేతో అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 3.5 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, కాంక్రీట్ రహదారి ఒక కిలోమీటరు నిర్మాణం జరిగిందని, రూ.10.50 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగతా పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, 2026 అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించామని చెప్పారు. కాంట్రాక్టర్ కమాలుద్దీన్ అనారోగ్యంతో ఉన్నందున అతనికి చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు కూడా త్వరలో విడుదల చేస్తామని మంత్రి వెంకటరెడ్డి హామీ ఇచ్చారు.

# సీసీ రోడ్లతో గ్రామాల రూపురేఖల్లో మార్పు

## సర్పంచ్ సుగుణ సంపత్



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్

**యాచారం , జనవరి 2 ( నీలగిరి ఎక్స్ ప్రెస్**

సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాల రూపురేఖల్లో మార్పు వస్తుందని సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ అన్నారు. యాచారం మండలం నక్కర్త – మేడిపల్లిలో సిసి రోడ్డు పనులను శుక్రవారం సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సంద్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ... ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో నక్కర్త మేడిపల్లి గ్రామం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉపసర్పంచ్ దేంది. మధుకర్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు , మరియు మాజీ ఎంపిటిసి శ్రీశైలం , గ్రామ పెద్దలు మరియు వివిధ పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు.

# ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



**ఇబ్రహీంపట్నం,జనవరి 02 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాయపోల్ గంగమ్మ- పెద్దమ్మ దేవాలయం ఆవరణంలో శుక్రవారం ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన అన్నదాన ప్రభువు, ఉప్పరిగూడ మాజీ సర్పంచ్ బూడిద రాంరెడ్డి పాల్గొని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మహాపడి పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప.. శరణంశరణం అయ్యప్ప.. స్వామి శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో రాయపోల్ మార్మోగింది. ఈ మహాపడిపూజ మహోత్స వానికి పెద్దఎత్తున అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని అయ్యప్ప నామస్మర ణం, భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంకాల దాసు, సీనియర్ జర్నలిస్టు( అయ్యప్ప స్వామి) మొలుగు శ్రీనివాస్, జిల్లా జర్నలిస్ట్ నాయకులు చెరుకూరి మహేందర్, టీయూడబ్ల్యూజే (హెచ్-143)నియోజకవర్గం అధ్యక్షులు సూరమోని సత్యనారాయణ, నల్లోల కిషన్, సూరమోని బాబు, భూచక్రం గౌడ్, గోవర్ధన్ గుప్తా, మహేష్ చారి తదితరులు ఉన్నారు.

# వినోదం కోసం ప్రతి ఒక్కరూ సినిమాను వీక్షించాలి

- మాజీ జెడ్పిటీసీ కండె హరిప్రసాద్



**ఆమనగల్లు, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వినోదం కోసం ప్రతి ఒక్కరూ సినిమాను వీక్షించాలని,పట్టణానికి చెందిన ఉప్పు రాము ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా నిర్మించిన మిస్టేరియస్ సినిమాను ప్రతి ఒక్కరూ చూడాలని మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర టాకీస్ లో ప్రదర్శించిన సినిమాను వీక్షించి ఉప్పు రామును శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో కుటుంబాలు ఏరకంగా చిద్రం అవుతున్నాయని కళ్ళకు కట్టినట్లు చూపించారన్నారు. నేటి సమాజానికి కావాల్సిన ముఖ్యమైన చిత్రం చిన్న చిన్న డైరెక్టర్లు గొప్ప ఆలోచనతో సమాజంలో మార్పు తేవడానికి వారియొక్క శ్రమకు సమాజం ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రేవల్లి రాజు, జంతుక శంకర్, నాగిళ్ళ జగన్, పూసల భాస్కర్,ప్రభు శంకర్, నాజర్, శ్రీను నాయక్, కోట రాములు, ఇమ్మానియేల్, ఉప్పు సురేష్, పాలధి శ్రీను, ప్రేమ్, రమేష్, ప్రవీణ్, కొర్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# హామీని అమలు పర్చిన సింగంపల్లి సర్పంచి



**ఆమనగల్లు, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు మండలం సింగం పల్లి గ్రామంలో అసౌకర్యంగా ఉన్న రోడ్డు సమస్యను సర్పంచి శానమోని సత్యం పరిష్కరించారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచిగా ఎన్నికైన వెంటనే రోడ్డు సమస్యను పరిష్కరిస్తానని మాట ఇచ్చిన మేరకు శుక్రవారం ఆకుతోట పల్లి సింగం పల్లి పోలేపల్లి గేట్ వరకు రోడ్డు మరమ్మత్తు చేసి గ్రామ ప్రజలకు, బాటసారులకు,వాహన దారులకు ఇబ్బంది లేకుండా చేశారు. దీంతో గ్రామంలో పలువురు సర్పంచి సత్యం ను అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి సీహెచ్ రవీంద్ర, వార్డు మెంబర్లు నర్సింహ, అయోధ్య, తానేష, మంజుల మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వేణుగోపాలస్వామి ఆలయ భూములకు అన్యాయం



**కద్తాల్, జనవరి 2 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: కద్తాల్ హిందూధలం ఆధ్వర్యంలో ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కద్తాల్ మండలం మక్తమాదారం వేణుగోపాల స్వామి దేవాలయ భూమిలోనుండి బీదర్/మహేశ్వరం 765ఖఎ హై టెన్షన్ లైన్ వారు దేవాలయ భూములకు అడిగేవారు ఎవరూ లేనందున తక్కువ నష్టపరిహారం ఇస్తూ వారి ఇష్టానుసారంగా లైన్ వేస్తున్నందున మేము కద్తాల్ మండల హిందూ దళం సభ్యులము దేవాలయ భూములకు తక్కువ నష్టపరిహారం చెల్లించి ఇతర రైతులకు ఎక్కువ పరిహారం చెల్లిస్తూ దేవాలయ భూములకు అన్యాయం చేస్తూ చాలా నష్టం కలగజేస్తున్నారు ఎండోమెంట్ ఆఫీసర్లు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా అక్రమంగా బీదర్ మహేశ్వరం 765 కెవి లైన్ కు అక్రమంగా అనుమతి ఇస్తున్నారు. డీజీఎం సంతోష్ కుమార్ తన ఇష్టానుసారంగా లైన్ ను తనకు ఇష్టం వచ్చినట్లుగా మార్చి దేవాలయ భూమికి నష్టం చేస్తున్నారు. కావున దయచేసి దేవాలయ భూములకు నష్టపరిహారం చెల్లించిన తరువాతనే హై టెన్షన్ లైన్ పనులు చేయాలని పనులు ఆపకుండా చేస్తే మేము కద్తాల్ హిందూ దళం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరిస్తున్నాము. కావున దయచేసి తక్షణమే పనులు ఆపాలని, పనులు ఆపే విధంగా మీరు సహకరించాలని కోరుతూ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజెపి కద్తాల్ మండల అధ్యక్షులు దోనాదుల మహేష్,హిందూ దళం సభ్యులు లక్ష్మీదేవి ప్రభాకర్,జనీల్ శ్యాంసుందర్ , అనిల్ పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



**కద్తాల్, జనవరి 2 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కద్తాల్ మండల కేంద్రంలోని బోసు నారయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహానికి పూలమాలవేసినివాళులర్పించారు.వారి కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పి అధైర్య పడవద్దని పరామర్శించి కద్తాల్ మాజీ జెడ్పిటిసి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ తన ట్రస్ట్ నుండి 5వేల రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది.అలాగే కద్తాల్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ 5వేల రూపాయలు ఆర్థిక సాయం చేయగా, కద్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి 5వేల రూపాయలను బోసు నారయ్య కుటుంబ సభ్యులను ఆర్థిక సహాయం అందించారు. ఏ.పీ.జీ.బి.బ్యాంక్ రిటైర్మెంట్ ఉద్యోగి ఉదయం 4 గంటలకు మరణించారు.ఇట్టి విషయం తెలుసుకున్న కద్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు.ఈ కార్యక్రమంలో . గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ,మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు అశోక్, నరసింహ, సురేష్,యాదయ్య, వెంకటేష్, శ్రీను,జంగయ్య,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 3 లక్షల విరాళం అందజేత

-ప్రతి ఒక్కరు సేవాగుణం అలవర్చుకోవాలి
-ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా



**కద్తాల్, జనవరి 2 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అర్థం లక్ష్మయ్య గుప్తా పుట్టినరోజు సందర్భంగా కద్తాల్ మండలంలోని ముద్విన్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం రూ. 3, లక్షల విరాళం ఎస్సై వరప్రసాద్ కు అందజేశారు. అదేవిధంగా మండలంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సేవా దృక్పథంతో మరింత సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. అనంతరం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి ఆయనకు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అర్థం వాసుదేవ్ గుప్తా, నాయకులు చింతల వెంకటయ్య గుప్తా, వేముల రమేష్, అర్థం చంద్రయ్య, అర్థం రమేష్, అర్థం రవి, మండల కోశాధికారి కరుణాకర్, ఎస్సై వరప్రసాద్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ దోనాదుల కుమార్, జోగు వీరయ్య, సతీష్, ముద్విన్ మాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ వినోద్ తదితరు పాల్గొన్నారు.

# టిఎస్యూటీఎఫ్ క్యాలండర్ ఆవిష్కరణ



**కద్తాల్, జనవరి 2 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టిఎస్ యుటిఎఫ్ కద్తాల్ మండల శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్, మండల విద్యాధికారి నిర్మల పాల్గొని ప్రసంగిస్తూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యుటిఎఫ్ రాజీ లేని పోరాటాల చేసిందని అన్నారు.అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ అనే లక్ష్యాల తో హక్కులు బాధ్యతలు ఉద్యమ నేత్రాలుగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. కేవలం ఉపాధ్యాయ సమస్యలే కాకుండా విద్యార్థుల సమస్యలు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుందని అన్నారు.ఈ సంవత్సరం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ను పెంచాలని ఉపాధ్యాయులకు పిలుపు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్,మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంగయ్య, క్రిష్ణ, ఉపాధ్యక్షులు మల్లయ్య, మూర్తి,రాజు, సత్యనారాయణ, రఘు పతి,రవీంద్రారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థాల నుండి సంపద ప్రదర్శన

**వనపర్తి, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వనపర్తి జిల్లా పరిషత్ హై స్కూల్ బాలురలో గురువారం జిల్లా స్థాయి వ్యర్థాల నుండి సంపద ప్రదర్శన ఘనంగా జరిగింది. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ హరిత పంటలు ఎకో క్లబ్ విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించబడింది.జిల్లాలో ఎంపికైన పాఠశాలల ఎనిమిదవ, తొమ్మిదవ తరగతి విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. వ్యర్థాలను ఉపయోగించి ఆకర్షణీయమైన కళారూపాలు, వినియోగదాయక వస్తువులు రూపొందించి పర్యావరణ పరిరక్షణకు తమ కృషిని చూపించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములవ్వాలని సూచించారు. పరిసరాలలోని వ్యర్థాలను అర్థవంతమైన వస్తువులుగా మార్చి సమాజానికి ఉపయోగపడే విధంగా కృషి చేయాలని



ప్రోత్సహించారు. ఈ ప్రదర్శన ద్వారా విద్యార్థులు ఉపయోగించని వస్తువులను కళారూపాలుగా మార్చవచ్చని నిరూపించారని ఆయన ప్రశంసించారు.ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి వనపర్తి జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు మూడు వేల రూపాయలు, ద్వితీయ బహుమతి కేతెపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌కు రెండు వేల రూపాయలు, తృతీయ బహుమతి వనపర్తి జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు వెయ్యి రూపాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్జిసి ప్రాజెక్ట్ అధికారి, ప్రభుత్వ పరీక్షల ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా సైన్స్ అధికారి, అకడమిక్ మానిటరింగ్ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సెక్టొరియల్ అధికారులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధిపై తీర్మానం



**కడ్తాల్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మండలంలోని మక్త మాదారం గ్రామ పంచాయతీ సమావేశం శుక్రవారం నిర్వహించబడింది. గ్రామ అభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చిస్తూ గ్రామ సర్పంచ్ నరసింహ గౌడ్ మాట్లాడుతూ, మహిళా సంఘం భవనం నిర్మాణం, డోక్రా గ్రూప్ భవనం, క్రీడా మైదానం అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, పచ్చదనం మరియు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.అండర్ డ్రైనేజ్ వ్యవస్థ, సిసి రోడ్ల నిర్మాణం, గ్రామంలో జియో టవర్ సిగ్నల్ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. గ్రామ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళిక అవసరమని సర్పంచ్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, వార్డ్ సభ్యులు శ్రీకాంత్ గౌడ్, నింగ్యారి యాదగిరి, ఎర్రమల యాదయ్య, మరల యాదయ్య, అక్యరి మహేశ్వరి, బండి సరిత, అక్యరి మైసమ్మ, గ్రామ కార్యదర్శి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## హై స్కూల్‌కి సొంత నిధులతో ఫిల్టర్ బహుమతిగా అందజేసిన కుండే కుమార్



**మహేశ్వరం, జనవరి 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామ హైస్కూల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను గమనించిన కుండే కుమార్, రాజకీయాలకు అతీతంగా స్వంత నిధులతో ఫిల్టర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు పరిశుద్ధమైన నీరు అందేలా చేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చేసిన ఈ సేవా కార్యక్రమం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.గతంలో కూడా పాఠశాలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన కుండే కుమార్, ఈ సందర్భంగా గ్రామంలో బస్‌స్టాప్ లేక పెద్దవాళ్లు ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే చత్రపతి శివాజీ విగ్రహం దగ్గర బస్‌స్టాప్ ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ప్రజల మధ్యలో ఉండి, ఎవరికి ఎలాంటి అవసరం వచ్చినా ముందుండి సహాయం చేయడం తన ధర్మమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు, యువకులు పాల్గొనగా, గ్రామస్తులు కుండే కుమార్ చేసిన సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

## కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డిని సన్మానించిన నాగిరెడ్డిపల్లి గ్రామస్తులు



**కందుకూరు, జనవరి 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** :రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలో ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డిని నాగిరెడ్డిపల్లి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మహేశ్వరం నియోజకవర్గం (ఐఎన్‌టియుసి) కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడ శివ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆర్డీవోను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి, చాలువతో సత్కరించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆర్డీవోకు తమ అభినందనలు తెలియజేస్తూ, ప్రజా సేవలో ఆయన కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి గ్రామ ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు మిద్దె శశికాంత్ రెడ్డి, గ్రామ ఉపాధ్యక్షులు కొండూరు గణేష్, యూత్ అధ్యక్షులు నడికుడా కార్తీక్, రైతులు నడికుడా బిక్షపతి, కాట్రావత్ చక్ర, కేతవత్ మూల్యా, తౌరియా రతన్ పాల్గొన్నారు.

## పాల్వంచ మండల రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక....

**పాల్వంచ – జనవరి 2( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం రెడ్డి సంఘం యొక్క నూతన కార్యవర్గం సభ్యుల ఎన్నిక జరిగింది.అధ్యక్షులు : కట్ట ప్రశాంత్ రెడ్డి రాజకృష్ణారెడ్డి ఉపాధ్యక్షు: కట్ట భాస్కర్ రెడ్డి సిద్ధారెడ్డికోశాధికారి: కాంసాని దేవేందర్ రెడ్డి, బలరాం రెడ్డి ప్రధాన కార్యదర్శి: కేసిరెడ్డి నరసింహారెడ్డి, బాల్ రెడ్డి కార్యదర్శి: కర్క శ్రీనివాసరెడ్డి చిన్న బాల్ రెడ్డి సలహాదారులు. కాంసాని బాపురెడ్డి తిమ్మనగారి శ్రీనివాస్ రెడ్డి కేశిరెడ్డి బాల్ రెడ్డి నియమించడం జరిగింది.

## అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అధికారులు, సిబ్బంది భాగస్వామ్యం అవసరం

**-జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**




**నల్లగొండ, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, వివిధ ఉద్యోగ సంఘాలు, రైస్ మిల్లర్ల సంఘాల ప్రతినిధులు కలెక్టర్ బి. చంద్రశేఖర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా, మండల, గ్రామస్థాయిలో అందరినీ సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరేలా అమలు చేయాలని సూచించారు. పథకాల అమలులో క్షేత్రస్థాయిలో అందరికీ న్యాయం జరిగేలా చూడాలని, అప్పుడే జిల్లా సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని ఆయన స్పష్టం చేశారు.కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్, ఆర్‌డీ ఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా రవాణా కమిషనర్ వాణి తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులకు ఉపయోగపడేలా జిల్లా అధికారులు, సిబ్బంది, గజిటెడ్, టీఎన్జీవో, రెవెన్యూ సర్వీసెస్, ట్రాన్స్పోర్ట్ సంఘాల ప్రతినిధులు కలెక్టర్‌కు నోట్‌బుక్కులు, పెన్నులు, దుప్పట్లు, పూల మొక్కలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కేక్ కట్ చేసి, వివిధ ఉద్యోగ సంఘాల నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు.

## రెవిన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులు చురుకుగా వ్యవహరించాలి

**జిలా కలెకర్ బి. చందశేఖర్**



**నల్లగొండ, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నల్గొండ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ బి. చంద్రశేఖర్, ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులకు ఖచ్చితమైన పరిష్కారం ఉండాలని, తరచుగా వచ్చే ఫిర్యాదులను తగ్గించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఫిర్యాదులను స్వీకరించడమే కాకుండా, పిర్యాదుదారులకు రసీదు ఇవ్వాలని, ఫిర్యాదుల రిజిస్టర్లు, అన్ని వివరాలు కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అవసరమైన సమయంలో రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతినెల తప్పనిసరిగా తహసిల్దార్‌ల సమావేశం నిర్వహించబడుతుందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భూ భారతి, పౌరసరఫరాలు తదితర అంశాలపై సమీక్ష జరిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, ఆర్‌డీ ఓ అశోక్ రెడ్డి, దేవరకొండ ఆర్‌డీ ఓ రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర రైతు వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మర్రి నిరంజన్ రెడ్డి



**ఇబ్రహింపట్నం, జనవరి 2( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర రైతు వ్యవసాయ కమిషన్ చైర్మన్, మాజీ ఏమ్మెల్యే ముదిరెడ్డి కోదండ రెడ్డి శుక్రవారం జన్మదిన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసిన టిపిసిసి సభ్యులు & ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి . ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వి హనుమంతరావు , తెలంగాణ వ్యవసాయ రైతు కమిషన్ కమిటీ సభ్యులు మరికంటి భవాని రెడ్డి , కేవీఎన్ రెడ్డి, యాచారం మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, తమ్మలోని గూడా సర్పంచ్ దెంది రామ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# మహేశ్వరంలో ఘోర రోడ్డు ప్రమాదం

**- ఇద్దరు యువకులు మృతి**



**మహేశ్వరం, జనవరి 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో విషాదాన్ని మిగిల్చిన ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మహేశ్వరం మండల పరిధిలోని బుచ్చిరెడ్డి పౌల్ట్రీ సమీపంలో తవేరా వాహనం అదుపుతప్పి పల్టీ కొట్టడంతో పోరండ్ల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు తీవ్ర గాయాలతో బయటపడ్డాడు.ఈ ఘటనలో తౌటి శ్రీకాంత్, సందన్ గిరి అనే యువకులు ప్రాణాలు కోల్పోగా, మరో యువకుడిని పోలీసులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబాలకు అప్పగించారు.యువకుల అకాల మరణంతో పోరండ్ల, కోళ్లపడకల్ గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పొద్దున్నే లేచి కష్టపడి పనిచేసే యువకులను ఇలా చూడాల్సి వస్తుందని ఊహించలేదని గ్రామ ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని, కుటుంబాలకు దేవుడు మనోధైర్యం ఇవ్వాలని గ్రామస్తులు ప్రార్థించారు.

## రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు రవీందర్ నాయక్ ని కలిసిన బాబా



**ఆమనగల్లు, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ ని శుక్రవారం ఆయన చాంబర్ లో కేఎన్ఆర్ వ్యవస్థాపక దళం అధ్యక్షుడు మెకానిక్ బాబా మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో ఆమనగల్లు ఆసుపత్రి కమ్యూనిటి హెల్త్ సెంటర్ ను త్వరగా వినియోగంలోకి తెచ్చి, నాలుగు మండలాల ముఖ్య కూడలైన ఆమనగల్లు పేదలకు మేలు చేకూర్చాలని ఆయనకు విన్నవిం చడం జరిగింది.

## ఈత చెట్టు నుండి జారి గాయపడిన గీత కార్మికుడు



**కమాన్‌పూర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కమాన్‌పూర్ మండలం పేరపల్లి గ్రామానికి చెందిన తోడేటి చిన్న కనకయ్య అనే గీత కార్మికుడు ప్రమాదవశాత్తు చెట్టు నుండి జారి తీవ్ర గాయాలపాలయ్యాడు.వివరాల ప్రకారం, గురువారం సాయంత్రం కల్లు గీసే క్రమంలో ఈత చెట్టు ఎక్కిన కనకయ్య కాలుజారి కిందపడగా, తోటి గీత కార్మికులు వెంటనే స్పందించి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై గ్రామ సర్పంచ్ బొంగోని సదయ్య స్పందిస్తూ, గాయపడిన గీత కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వపరంగా ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని కోరారు.

# సత్యం, అహింస మార్గాలతోనే సుస్థిర అభివృద్ధి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి



**నల్లగొండ, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గాంధీ జ్ఞాన్ ప్రతిష్టన్ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న లి"మహాత్మా గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సులు స్వదేశీ మేళాలు"లిలో భాగంగా ఈనెల 30న నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల ఆవరణలో రాష్ట్రస్థాయి సదస్సు, స్వదేశీ మేళా నిర్వహించనున్నట్లు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు.సత్యం, అహింస సిద్ధాంతాల ఆధారంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జీవన తత్వాన్ని ప్రతిబింబించేలా గాంధీజీ విగ్రహాల సామూహిక ప్రదర్శన, చరకాల ప్రత్యక్ష ప్రదర్శన, సుస్థిర విద్య, సుస్థిర వైద్యం, సేంద్రీయ వ్యవసాయం, సహజ ఇంధన వనరులు, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ పరిశ్రమలు, సుస్థిర క్రీడలు, స్వదేశీ, స్వావలంబన, స్వాభిమాన దిశగా ప్రదర్శనలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.అదేవిధంగా ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేయనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మల్కంబు, యోగా, ఎద్దు గానుగ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. గాంధీజీ 150వ జయంతి సందర్భంగా నల్లగొండ ఎన్జీ కళాశాలలో 5500 మంది బాల గాంధీలు వేషధారణ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన చారిత్రాత్మక సందర్భాన్ని ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ రెడ్డి గుర్తు చేశారు.ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లాల స్వచ్ఛంద సంస్థలు, వివిధ అసోసియేషన్లు, ప్రభుత్వప్రైవేటు రంగ ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు, క్రీడా సంఘాలు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థి సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సంస్థల చీఫ్ అడ్వైజర్ ఎం.వి. గోన రెడ్డి, కన్వీనర్ నీరుడు సంజీవరెడ్డి, ప్రతినిధులు కే. కరుణాకర్ రెడ్డి, బొమ్మపాల గిరిబాబు, కందిమల్ల నాగమణి, జి. జ్యోతి, పాముల అశోక్, ఎం. శ్రీనివాస్ రెడ్డి, ఎం.డి. అజీజ్, వై. రాధిక, ఎం. అరుణ, పి. శ్రీనివాస్ గౌడ్, టీ. చిరంజీవి, వై. ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ధనుర్మాస ఉత్సవం, గోదా అమ్మవారికి సారే కార్యక్రమం



**నల్లగొండ,జనవరి 2 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో 18వ పాశురం సందర్భంగా గోదా అమ్మవారికి సారే(పట్టు వస్త్రాలు , పండ్లు పూలు పసుపు కుంకుమ పిండివంటలు గాజులు) అమ్మవారికి మేళ తాళాలతో, భక్తుల హర్ష జనాల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సమర్పిం చారు. అనంతరం భక్తులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ప్రవచకులు త్రిదండి రామచంద్ర జీయర్ స్వామి కౌన్సిలర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి వికాస తరంగిణి అధ్యక్షురాలు చొక్కారపు మాధవి, కార్యదర్శి ఈశ్వర్ రెడ్డి, మహిళా ఆరోగ్య వికాస్ కోఆర్డినేటర్ యర్రమద సుజాత, శిరీష్ కుమార్, మంతిన మాధవి, ఏచూరి రమాదేవి, నూకల సంధ్యారాణి, అక్కినపల్లి పద్మ, భువనగిరి భారతి, సరస్వతి, అర్చకులు, స్థానాచార్యులు పాల్గొన్నారు.

# మేకలకు, గొర్రెలకు నట్టల మందు పంపిణీ చేసిన సర్పంచ్ మట్ట యాదమ్మ, వెంకటయ్య గౌడ్



**వెల్దండ, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:వెల్దండ మండల కేంద్రంలో పశువుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం జరిగింది. వెటర్ని డాక్టర్ శ్యాంసుందర్ పర్యవేక్షణలో స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని గొర్రెలకు, మేకలకు మందు త్రాగించారు.గ్రామ ప్రజల పశువుల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బస్నామోని శ్రీనివాస్, వార్డు సభ్యులు మసిగుండ్ల వెంకటేష్, పురుషోత్తం చారి, రమేష్, రషీద్, హమీద్, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, కృష్ణ, పాండు, శ్రీనివాస్, రామకృష్ణ, మల్లేష్, బడుక బీరేష్, ప్యాటా బీరయ్యతో పాటు పశువైద్య సిబ్బంది నరేష్ రెడ్డి, నరసింహ, ఫణిందర్ రెడ్డి పాల్గొన్నారు.గ్రామస్థులు సర్పంచ్ యాదమ్మ, వెంకటయ్య గౌడ్ చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, పశువుల ఆరోగ్య పరిరక్షణలో ఇలాంటి చర్యలు తరచుగా జరగాలని ఆకాంక్షించారు.

# రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ, ఆన్లైన్ యూరియా బుకింగ్‌పై అవగాహన



**మాడుగుల, జనవరి 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాడుగుల మండలంలోని అధీకృత డీలర్ షాపులలో యూరియా నిల్వలను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్లు ఎప్పటికప్పుడు యూరియా అమ్మకాలను ఈపాస్‌లో అప్డేట్ చేయాలని ఆదేశించారు.తదుపరి మాడుగుల గ్రామంలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ మరియు ఆన్లైన్ యూరియా బుకింగ్ విధానంపై అవగాహన కల్పించారు. యూరియా లభ్యతపై రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని, పట్టా పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్‌ను సంబంధిత అధీకృత షాపులలో సమర్పించి యూరియా పొందవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఓ అరుణకుమారి రైతులతో కలిసి పాల్గొని, వారికి వివరాలు అందించారు. రైతులు ఈ అవగాహన కార్యక్రమాన్ని అభినందిస్తూ, యూరియా సకాలంలో అందుబాటులో ఉండడం తమకు ఎంతో ఉపయుక్తమని తెలిపారు.

# స్కాలర్షిప్ ఫీజు రీయంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి



**దేవరకొండ జనవరి 02.(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
డిండి మండలంలోని ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విచ్చేసినటువంటి ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సురికి వినయ్ కుమార్, వట్టెపు శివకుమార్ మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి విద్యార్థి సంస్థ ఏదైనా ఉందంటే అది కేవలం ఏఐఎస్ఎఫ్ మాత్రమేనని అన్నారు, భారతదేశానికి స్వాతంత్రం రావాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేస్తూ భారతదేశానికి స్వాతంత్రం తీసుకురావడంలో ఎంతో ముఖ్యపాత్ర పోషించిందని అన్నారు, నేటికి, నాటికి భారతదేశంలోని విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తూ, ఎన్నో సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నటువంటి ఏకైక సంస్థ ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్, ఫీజురీయంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని అదేవిధంగా ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హర్షిత, హబీబా, అక్షర, అనూష,కార్తీక్, జీవన్ , కావ్య, సింధు, మౌనిక , నికిల్, జశ్వంత్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేయాలి



**హుజురాబాద్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుజురాబాద్ పట్టణ శాఖ అధ్యక్షుడు తుర్పాటి రాజు ఆధ్వర్యంలో దర్శిని ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కార్యకర్తలు మున్సిపల్ చైర్మన్ పదవి సాధించేందుకు కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు భారతీయ జనతా పార్టీపై విశ్వాసంతో ఉన్నారని, అభ్యర్థులను విజయవంతం చేస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఓటర్ జాబితాలో అవకతవకలపై మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.సమావేశంలో ముఖ్య అతిథిగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రాల నిర్మల రెడ్డి పాల్గొన్నారు. పట్టణ అధ్యక్షుడు తుర్పాటి రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రావుల వేణు, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్, తూముల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, మాజీ కౌన్సిలర్ వెంకటరెడ్డి, నల్ల సుమన్, మెరుగు రాజిరెడ్డి, కేసరి శేషయ్య, మాజీ సర్పంచ్ పోతుల సంజీవ్, పల్లె వీరయ్య, గూడూరి రామిరెడ్డి, ఇతర నాయకులు, ప్రజా ప్రతినిధులు, శక్తి కేంద్రం ఇన్‌ఛార్జిలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యతోనే అన్ని సమస్యలకు పరిష్కారం




**కరీంనగర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విద్యే అన్ని సమస్యల పరిష్కారానికి ప్రధాన ఆయుధమని మహాత్మ జ్యోతిరావ్ పూలే తెలంగాణ బిసి విద్యాలయాల రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు.తిమ్మాపూర్ సాంఘీక సంక్షేమ కళాశాలలో లీడ్ ఇండియా2047, శాతవాహన లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, పాఠ్యాంశాలతో పాటు నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం నేటి డిజిటల్ యువతకు అవసరమని పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్థాపించిన లీడ్ ఇండియా ఉద్యమం విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు.ప్రధాన వక్త లయన్ కెప్టెన్ ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, యువత దినచర్య, అలవాట్లు వ్యక్తి భవిష్యత్తు తీర్చిదిద్దుతాయని, మంచి అలవాట్లు గమ్యానికి చేరడానికి నిచ్చెనలుగా ఉపయోగపడతాయని చెప్పారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జనవరి 3న జరగనున్న తెలంగాణ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం వేదికగా బాలికల అభ్యున్నతికి ఉన్నత విద్యే ప్రధాన సాధనం అని వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్ వడకాపురం జగదీశ్వరాచారి, లయన్ ఎం. మహేందర్ పాల్గొని విద్యతో పాటు వినయాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సభాధ్యక్షురాలు ప్రిన్సిపాల్ డా. సరితతో పాటు పలువురు మహిళా ఉపన్యాసకులను లీడ్ ఇండియా2047, శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు.

# జనవరి 18 న,జరిగే సిపిఐ 100 ఏళ్ల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి**



**దేవరకొండ జనవరి 02.(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
.జనవరి 18న, ఖమ్మం నగరంలో జరిగేభారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందేళ్ళ ముగింపు బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు శుక్రవారం డిండి సిపిఐ కార్యాలయంలో జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ,పేద ప్రజలకు అండ సిపిఐ జెండా, దున్నేవాడికి భూమి నినాదంతో లక్షలాది ఎకరాలు పేదలకు పంచిన ఘనమైన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని అన్నారు.సామ్రాజ్యవాద వ్యతిరేక భూస్వామ్య పెట్టుబడుదారు వర్గాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని అన్నారు.భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి నేటితో 101వ సంవత్సరంలోకి అడుగుపెట్టిందని దేశంలో 100 సంవత్సరాల ఉద్యమ పార్టీగా సిపిఐ ఖ్యాతి పొందిందని అన్నారు.గ్రామాల్లో సిపిఐ గ్రామ శాఖల సమావేశాలను నిర్వహించి నూతన సభ్యత్వం,సభ్యత్వ పునరుద్దరణ చేయాలని అన్నారు.ప్రజల్లోకి పార్టీ నాయకులు శాఖ సమావేశాల ద్వారా పార్టీ చరిత్రను ప్రజలకు తెలిసేలా కార్యకర్తలను చైతన్యం చేయాలని సూచించారు.అనంతరం సిపిఐ అగ్ర నేత,మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏ.బి.బర్ధన్ 10వ, వర్ధంతి సందర్భంగా కామ్రేడ్ బర్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కామ్రేడ్ బర్ధన్ జీవితం స్ఫూర్తి దాయకమని ఆయన ఆశయాలకు పునరంకితమవ్వాలని శ్రేణులకు బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు.అనంతరం సిపిఐ తరుపున సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి గెలిసిన నూతన సర్పంచ్ లను, వార్డు సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.మండల సహాయ కార్యదర్శి తిప్పర్తి విజేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దీన్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్,కార్యవర్గ సభ్యులు హనుమండ్ల కేశవులు,సోమిడి శ్రీనయ్య,నూనె వెంకటేశ్వర్లు,ఎనమల్ల నవీన్ పాల్గొన్నారు.

# ఘనంగా ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**అడవిదేవులపల్లి, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నల్గొండ జిల్లా ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి జన్మదినాన్ని అడవిదేవులపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కూరాకుల చిన్న రామయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయంగా జరిపారు.ఈ సందర్భంగా రఘువీర్ రెడ్డి సేవా కార్యక్రమాలను గుర్తుచేసుకుంటూ, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ ప్రజలు, నాయకులు కలిసి కేక్ కట్ చేసి, పూలమాలలు వేసి జన్మదినాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూరాకుల చిన్న రామయ్యతో పాటు కూరాకుల శ్రీనివాస్, కూరాకుల రవీంద్రనాథ్, గోపగాని హనుమంతు, అల్లాని కోటయ్య, గొడుగు అన్నమయ్య, బండి వెంకటనారాయణ, పెద్దింటి గోవిందు, కూరాకుల శేఖర్, బండి అయ్యప్ప, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు నూతన సంవత్సర శుభాకాంక్షలు




**హైదరాబాద్, జనవరి 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.శుక్రవారం నగరంలోని జాగృతి ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎదురుగట్ల సంపత్ గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామిడి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. వారు పుష్పగుచ్ఛం అందజేసి కవితకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పాండురంగా రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలు, సంస్థాగత బలోపేతం గురించి క్లుప్తంగా వివరించారు.కార్యక్రమంలో జాగృతి నాయకులు బాబురావు, చీమల రమేశ్, చదలవాడ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీనారాయణులకు లక్ష పుష్పార్చన




**వినోభా నగర్, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వినోభా నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ప్రతి రోజు నిర్వహిస్తున్న నారాయణ యాగంలో భాగంగా పదిహేడవ రోజు ప్రత్యేకంగా లక్ష్మీనారాయణులకు లక్ష పుష్పార్చన వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా జరిగింది. యాగశాల అంతటా వేదమంత్రాల నినాదాలు మార్మోగి పవిత్రతను నింపగా, లక్ష పుష్పాలతో స్వామివారికి అర్చన జరగడం భక్తుల హృదయాలను ఆనందభరితంగా మార్చింది.ఈ సందర్భంగా పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులు, దాతలు, భక్తులు సమిష్టిగా పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ధనుర్మాసంలో నారాయణ యాగం నిర్వహణ అపారమైన పుణ్యఫలాలను ప్రసాదిస్తుందని వేదపండితులు వివరించారు. లక్ష పుష్పార్చన ద్వారా లక్ష్మీనారాయణుల కృపాభిక్షలు లభిస్తాయని విశ్వాసంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

# పొగమంచు సమయంలో వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి




**మహబూబాబాద్, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లాలో ఉదయం వేళల్లో పొగమంచు తీవ్రంగా ఏర్పడుతున్న నేపథ్యంలో వాహనదారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఖ్రూా సూచించారు. పొగమంచు కారణంగా దృశ్యమానత తగ్గి రోడ్డు ప్రమాదాల ప్రమాదం అధికమవుతుందని ఆయన హెచ్చరించారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, వాహనాలు నడిపేటప్పుడు వేగం తగ్గించి నెమ్మదిగా ప్రయాణించడంతో పాటు తగిన భద్రతా చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. హెడ్లైట్స్, ఫాగ్ లైట్స్ వినియోగించడం, వాహనాల మధ్య తగిన దూరం పాటించడం అత్యవసరమని తెలిపారు. అనవసరంగా ఓవర్‌టేక్ చేయరాదని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ వినియోగించరాదని ఆయన స్పష్టం చేశారు.ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# పల్లెలకు పారిశుద్ధ్యం, నీరు, ఆరోగ్యం అవసరం



**షాద్ నగర్, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
శాసనమండలిలో ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి పల్లె సీమల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, ఆరోగ్య సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పట్టించుకోవాలని డిమాండ్ చేశారు.శుక్రవారం జరిగిన మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలలో గత పరిస్థితులకు అనుగుణంగా పారిశుద్ధ కార్మికులను నియమించినప్పటికీ, గ్రామాలు విస్తరించి అవసరాలు పెరిగినా కార్మికుల సంఖ్య పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ కార్మికుల సంఖ్యను పెంచడంతో పాటు, ప్రస్తుతం వారికి కేవలం 9 వేల రూపాయల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, దానిని కనీసం 15 వేల రూపాయలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా, అప్పటి ప్రభుత్వం మిషన్ భగీరథ పైప్‌లైన్లు వేసినప్పటికీ, ప్రస్తుతం నీటి అవసరాలు పెరిగిన నేపథ్యంలో వాటిని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని సూచించారు. గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సదుపాయాలు కల్పించి, సిబ్బందిని పెంచాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఈ సమస్యలను తప్పనిసరిగా పట్టించుకొని, పల్లె ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి శాసనమండలిలో స్పష్టం చేశారు.

## గన్నేరువరం మండలంలో గడ్డి మందు తాగిన యువకుడు ఆ అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలింపు



**గన్నేరువరం జనవరి 2( నీలగిరి ఎక్స్ప్రెస్)**
గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు అనుకోకుండా గడ్డి మందు తాగిన సంఘటన సమాచారం అందిన వెంటనే,కొమ్మెర రవీందర్ రెడ్డి ఫౌండేషన్ అంబులెన్స్ సిబ్బంది స్పందించి ఆ యువకుడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారుఇటీవలి రోజుల్లో చిన్న చిన్న కారణాల వల్ల లేదా వ్యక్తిగత ఒత్తిళ్ల వలన యువకులు ఆత్మహత్యకు ప్రయత్నిస్తుండడం బాధాకరం. ముఖ్యంగా ప్యారాక్విట్ లాంటి ప్రమాదకరమైన గడ్డి మందు వాడటం వలన అనేక విలువైన ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. ప్యారాక్విట్ వినియోగం తగ్గించాలన్నది సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. జీవితం అనేది ఒక ప్రయాణం ఎత్తుపల్లాలు సహజం. సమస్యలతో పోరాడి, కుటుంబం మరియు సమాజం సహకారంతో మెరుగైన భవిష్యత్తు నిర్మించుకోవచ్చు. మనం అందరం కలిసికట్టుగా ఈ విధమైన గడ్డిమందుకి అడ్డుకట్ట వేయాలి. ఆత్మహత్య కాదు, ఆత్మవిశ్వాసమే ప్రతి యువకుడికి బంగారు భవిష్యత్తుకు మార్గం.కొమ్మెర రవీందర్ రెడ్డిజిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు

# జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

**2026లో జిల్లాను అన్ని విభాగాల్లో అగ్రస్థానంలో నిలబెడతామని సిబ్బంది సంకల్పం**



**రంగారెడ్డి, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డా. లలిత దేవిని శుక్రవారం సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరంలో జిల్లాను వైద్య ఆరోగ్య సేవలతో పాటు అన్ని విభాగాల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేందుకు సమిష్టిగా కృషి చేస్తామని సిబ్బంది హామీ ఇచ్చారు.ప్రజారోగ్య అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని డా. లలిత దేవి సూచించారు. అధికారుల సమన్వయం, సిబ్బంది నిబద్ధతతోనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి మొహమ్మద్ అక్రమ్, జిల్లా అకౌంట్స్ మేనేజర్ సి. నాగరాజు, డీడీఎం శ్రీనివాస్‌తో పాటు సెక్షన్ క్లర్కులు ఉస్మాన్ అలీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మాసోత్సవాల్లో బాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**మహబూబాబాద్, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ పట్టణంలోని గీతాంజలి స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని జిల్లా రవాణా శాఖ అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించడం, జీబ్రా క్రాసింగ్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరణ, వాహనాలను ఓవర్టేక్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలను పిల్లలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, మద్యం సేవించి వాహనం నడపరాదు, అధిక దూరం ప్రయాణించినప్పుడు విశ్రాంతి తీసుకోవాలి, శీతాకాలం, వర్షాకాలంలో రోడ్డు ప్రయాణాల సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు జనవరి 1 నుండి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలతో నిర్వహించబడుతున్నాయని అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని మోటార్






వెహికల్ ఇన్స్పెక్టర్లు ఎం. సాయి చరణ్, వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పది కేసులు నమోదు చేశారు.

## ఓసి క్లబ్ స్వాధీనంపై చర్యలు తీసుకోవాలని కోరిన సిపిఐ నేతలు



**మహబూబాబాద్, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వానికి చెందిన ఓసి క్లబ్ స్వాధీనంలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారధి రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం వినతి పత్రం అందించింది. ఈ సందర్భంగా అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ, కొంతమంది వ్యక్తులు అక్రమంగా కబ్జా చేయాలని చూస్తున్నారని, నాడు టిఆర్ఎస్ హయాంలో కూడా ప్రజా ప్రతినిధులు వేరే పేరుతో స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించగా, మున్సిపాలిటీ కౌన్సిల్‌లో మరియు ప్రజాక్షేత్రంలో అది మున్సిపాలిటీ ప్రభుత్వానిదే అని పోరాటం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సిపిఐ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలు, దీక్షలు, ఆందోళనలు నిర్వహించామని, ఈ సమస్యను మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువచ్చామని వివరించారు. వందల కోట్ల విలువైన ఈ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రజల బహుళ ప్రయోజనాల కోసం వినియోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కళాక్షేత్రం, ఎడ్యుకేషనల్ హబ్, ఇండోర్ స్టేడియం వంటి ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు ఈ స్థలంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, వీరవెల్లి రవి, ఎండి మహమూద్, రవి, చంద్రబోస్ పాల్గొన్నారు. ఈ విషయంపై స్పందించిన జిల్లా అడిషనల్ కలెక్టర్, ఓసి క్లబ్ ప్రాంతాన్ని స్వయంగా సందర్శించి, వెంటనే చర్యలు తీసుకొని ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.

## ధూళికట్ట సర్పంచ్‌కు ప్రభుత్వ పాఠశాలలో ఘన సన్మానం



**ఎలిగేడు, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని ధూళికట్ట హైస్కూల్లో గ్రామ సర్పంచ్ మారం కొమురయ్యకు ఘన సన్మానం జరిగింది. ప్రధానోపాధ్యాయులు సదయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మారం కొమురయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు కోసం తన వంతు సహాయం, సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల విద్యా ప్రగతికి అవసరమైన సదుపాయాల కల్పనలో తాను ముందుండి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బిజిలి సదయ్య, మిట్టపల్లి యుగేందర్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం




**రామగిరి, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామగిరి సెంటినరీ కాలనీలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం అదనపు గదుల నిర్మాణం కోసం పవన్ కళ్యాణ్ చొరవతో ఏపీ ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా రూ. 35.19 కోట్లు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో అనేక దేవాలయాలు శిథిలావస్థలో ఉన్నప్పటికీ సరైన వసతులు కల్పించకపోవడం బాధాకరమని, పవన్ కళ్యాణ్ కృషి వల్ల కొండగట్టు అభివృద్ధి సాధ్యమవుతోందని నాయకులు పేర్కొన్నారు. శనివారం గదుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరగనుండగా, స్వాగత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకుడు దోతుల సురేష్, మండల ఉపాధ్యక్షుడు ఇరుగురాల సంపత్, కొత్త కమలాకర్, గుండా శంకరయ్య, ఎరుకల నితిన్, వెంకటేష్, బాలయ్య, రాజయ్య, లక్ష్మి, మల్లమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాకర్స్ అసోసియేషన్ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



**పెద్దపల్లి, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఐటీఐ గ్రౌండ్ పెద్దపల్లి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2026 వాల్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఉదయం ఏడు గంటలకు జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు కొట్టే లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 304 ప్రథమ గవర్నర్ అన్నమనేని సుధాకర్ రావు చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎలెక్ట్ గవర్నర్ గుడిపాటి వెంకటరమణారెడ్డి, క్యాబినెట్ సెక్రటరీ గొట్టే ముక్కుల రవీందర్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ బుర్ర జగదీష్ గౌడ్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అన్నెడి వెంకటరెడ్డి, క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ రాచకట్ల నరసింహస్వామి, జోనల్ చైర్‌పర్సన్ సయ్యద్ అతిక్, జూనియర్ కాలేజీ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కే శ్రీనివాస్, కలిసి ఉంటే కలదు సుఖం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిర్రి తిరుపతి, ఐటీఐ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ రాజమల్లు, ఉపాధ్యక్షుడు గుంటి కుమారస్వామి, కోశాధికారి దీటి సతీష్, సంయుక్త కార్యదర్శి అలుగుబెల్లి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొత్తగా ఏర్పడిన దాత్రి మహిళా వాకర్స్ క్లబ్ మహిళా ప్రతినిధులను గవర్నర్ సుధాకర్ రావు సన్మానించారు. అలాగే వాకర్స్ ఇంటర్నేషనల్ ఫండ్‌కు రాచకట్ల నరసింహస్వామి, సయ్యద్ అతిక్ సేవాభావంతో ఒక్కొక్కరు రూ. 10,000 చొప్పున విరాళం అందించారు. జనవరి 4న కరీంనగర్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ వాకర్స్ డిస్ట్రిక్ట్ 304 మొదటి ఇన్స్టాలేషన్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో సభ్యులు హాజరుకావాలని ప్రతినిధులు కోరారు. వాకర్స్ సెంటర్ జాతీయ ప్రాముఖ్యతను వివరించారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేయాలని డిమాండ్

**పెద్దపల్లి, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



: పెద్దపల్లి పట్టణంలో మాస్టర్ ప్లాన్ లేకుండా కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలారపు పర్వతాలు యాదవ్ తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధి అనేది రాబోయే 2530 ఏళ్ల జీవనానికి బ్లూప్రింట్ కావాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు పూర్తి కాకముందే రోడ్లు వేయడం వల్ల వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి రావడం ప్రజాధనం వృథా అవుతోందని అన్నారు. జనాభా అంచనా, భూమి వినియోగం, డ్రైనేజీతో కూడిన సమగ్ర మాస్టర్ ప్లాన్ తప్పనిసరి అని, లేకుండా పనులు చేసిన బాధ్యులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలో పెరుగుతున్న దోమల బెడదకు మురుగునీటి కాలువల వైఫల్యమే కారణమని, ఓపెన్ డ్రెయిన్లలో నీరు నిల్వ ఉండడం వల్ల డెంగ్యూ వంటి వ్యాధులు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. శాశ్వత పరిష్కారం కోసం పూర్తి స్థాయి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, సరిగ్గా డిజైన్ చేసిన కాలువలు తప్పనిసరి అని, మున్సిపల్ అధికారులు తక్షణమే సమగ్ర సర్వే చేసి పనులను వేగవంతం చేయాలని ఆయన హెచ్చరించారు.

## హుస్నాబాద్ అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష



**హుస్నాబాద్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆధ్వర్యంలో హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఆర్డీవో రామ్మూర్తి, డిఆర్డిఓ జయదేవ్ ఆర్యతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పంచాయతీ రాజ్ శాఖలో జరుగుతున్న సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, హెల్త్ సబ్ సెంటర్లు, అంగన్వాడి టాయిలెట్స్, ప్రైమరీ హెల్త్ సెంటర్ రిపేర్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణాలు, జీపి బిల్డింగ్‌లు, అంగన్వాడి సెంటర్లు, రహదారి పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకా ప్రారంభం కాని పనులను వెంటనే మొదలుపెట్టాలని, నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం కింద చేపట్టిన పిహెచ్‌సి రిపేర్లు, ఆర్ అండ్ బి శాఖ రహదారి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. హుస్నాబాద్‌కొత్తపల్లి నాలుగు వరసల రహదారి నిర్మాణంలో విద్యుత్ స్తంభాలు, చెట్లు తొలగించే పనులు శాఖల సమన్వయంతో పూర్తి చేసి రహదారి పనులు ప్రారంభించాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో జంక్షన్ డెవలప్మెంట్, ఎల్లమ్మచెరువు రహదారి, అర్చులు, సుందరీకరణ పనులు నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సిద్దిపేటఎల్కతుర్తి జాతీయ రహదారి పనులు 85% పూర్తయ్యాయని, పందిళ్ల టోల్ ప్లాజా నిర్మాణం, బస్వాపూర్ ఫారెస్ట్ క్లియరెన్స్, విగ్రహాల తొలగింపు పనులు గ్రామాల సర్పంచ్, కార్యదర్శుల సమక్షంలో పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ శాఖ ఉపకేంద్రాల నిర్మాణం, గౌరవెల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో మిషన్ భగీరథ పనులు నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఉద్యానవన శాఖ అధికారులు ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని, రైతులతో సమావేశాలు నిర్వహించి ఆయిల్ ఫామ్ సాగు ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో సత్తా చాటిన గంగాధర మోడల్ స్కూల్ విద్యార్థినిలు

**గంగాధర, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం న్యాలకొండపల్లి మోడల్ స్కూల్ విద్యార్థినిలు రాష్ట్రస్థాయి అండర్14 ఎస్ జి ఎఫ్ ఖోఖో పోటీల్లో పాల్గొన్నారు. ఇటీవల వికారాబాద్‌లో డిసెంబర్ 30, 31 మరియు జనవరి 1 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో ఎన్. అక్షయ, ఏ. వాత్సల్య ప్రతినిధులుగా నిలిచారని పిడి నాగార్జున తెలిపారు. వీరిని గంగాధర మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఏ. పద్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

# 37వ జాతీయ రోడ్డు భద్రతా సంవత్సరం2026 కార్యక్రమాలు




**కరీంనగర్ /పెద్దపల్లి /**
**మానకొండూర్ జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జాతీయ రోడ్డు భద్రతా సంవత్సరం2026 సందర్భంగా కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు, సేఫర్ ఇండియన్ రోడ్స్ ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీనగర్‌లోని స్కాలర్స్ హై స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ పోలీస్ ఎస్‌హెచ్‌ఓ ఎండీ కరీం ఉల్లా ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై, రోడ్డు భద్రత ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ జి. లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల భాగంగా రేణికుంట టోల్ ప్లాజా వద్ద రవాణాశాఖ ఆధ్వర్యంలో సీట్‌బెల్ట్ అవగాహన కార్యక్రమం జరిగింది. అరవై కార్ల డ్రైవర్లను తనిఖీ చేయగా 45 మంది సీట్‌బెల్ట్ ధరించకపోవడం గమనించి, వారికి పువ్వులు అందజేసి చైతన్య పరచారు. ఈ కార్యక్రమంలో డీటీఓ శ్రీకాంత్ చక్రవర్తి, జిల్లా





ఆర్‌టీఏ సభ్యుడు రాహుల్ కుమార్, ఎంవిఐ రవి కుమార్, ఏఎంవిఐలు స్రవంతి, హరిత, రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ నీలం సంపత్, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం2026లో భాగంగా పెద్దపల్లి జిల్లాలోని పలు పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఆర్టీవో రంగారావు తెలిపారు. ఇండియా మిషన్ హై స్కూల్, మాస్టర్ మైండ్స్ స్కూల్ దొంగతుర్తి, జడ్.పి.హెచ్.ఎస్ నారాయణపూర్, సుల్తానాబాద్, నిట్టూర్, క్రెసెంట్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ధర్మారం, రంగంపల్లి పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించి, సీట్‌బెల్ట్ ధరించిన వారికి గులాబీ పువ్వులు అందజేశారు. ఆర్టీఏ కార్యాలయంలో కూడా రహదారి భద్రతా ప్రతిజ్ఞ నిర్వహించారు.ఈ మూడు జిల్లాల్లో నిర్వహించిన కార్యక్రమాలు రోడ్డు భద్రతపై ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా జరిగాయి.

## నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా పోలీసుల కఠిన నిఘా




**కరీంనగర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ప్రజల భద్రత కోసం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విస్తృత తనిఖీలు జరిగాయి. కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు పోలీసులు రాత్రంతా నిఘా కొనసాగించారు.మద్యం సేవించి వాహనాలు నడిపిన 281 మందిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. నంబర్ ప్లేట్ లేకపోవడం, సరైన ధ్రువపత్రాలు లేని కారణంగా 224 వాహనాలను కూడా సీజ్ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించగా, మొత్తం 1267 కేసులు నమోదు చేసి రూ.6.24 లక్షల జరిమానా వసూలు చేశారు.ప్రజల రక్షణ కోసం పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని కమిషనర్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించిన ప్రజలకు, అంకితభావంతో పనిచేసిన పోలీస్ సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

## రైతుల అవసరాలకు తగిన రుణాలు అందించాలి




**కరీంనగర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతుల అవసరాలకు అనుగుణంగా బ్యాంకర్లు రుణాలు అందించాల్సిన అవసరం ఉందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్ అన్నారు. 202627 సంవత్సరానికి సంబంధించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు చేయడంపై కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పంటల సాగులో ఖర్చులు పెరిగిన దృష్ట్యా గత సంవత్సరం కంటే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను పెంచాలని సూచించారు. వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు గోధుమలు, కూరగాయలు, చిరుధాన్యాలు, నగదు పంటలకు అధిక రుణ పరిమితి కల్పించాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో అధికారులు, రైతులు రుణాల మంజూరు, ఫైనాన్సింగ్ విధానం, పంటల పెట్టుబడులు, ఆదాయం తదితర అంశాలపై చర్చించారు. 20 మంది రైతులు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంపుపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సమావేశంలో డీసీసీబీ సీఈఓ సత్యనారాయణ రావు, కరీంనగర్ ఎల్డిఎం ఆంజనేయులు, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, నాబార్డ్ అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖ అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## రవికుమార్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన భగత్ నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం



**గంగాధర, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా భగత్ నగర్ వాసి రేగొండ రవికుమార్ పరమపదించడంతో ఆయన దహన సంస్కారాల నిమిత్తం భార్య పద్మకు భగత్ నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం తరఫున రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కొల్లూరి హరిప్రసాద్, నాగమల్ల శ్రీనివాస్, పైడ రవి పాల్గొన్నారు.

## ఘనంగా కలెక్టరేట్లో నూతన సంవత్సర వేడుకలు



**కరీంనగర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని టీఎన్జీవో భవనంలో ఉద్యోగులు ఆత్మీయంగా వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ, స్వీట్లు పంచుకున్నారు.తరువాత ఉద్యోగ సంఘాల నాయకులు మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకిడే, ఆర్డీవో మహేష్, ఏవో గడ్డం సుధాకర్‌లను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి ఉద్యోగులందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో సంగం లక్ష్మణరావు, ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హరేమేందర్ సింగ్, గంగారపు రమేష్, ఒంటెల రవీందర్ రెడ్డి, నల్ల వెంకటరెడ్డి, విజయ్ రాజేష్, భరద్వాజ్, వాస్తవి గౌడ్, శ్రీమాన్ రెడ్డి, ఇర్రుమల్ల శారద, సబిత, సునీత, హరిప్రియ, శైలజ, స్వర్ణలత, సుస్మిత, మన్మిట్, రాజేశ్వరరావు, అక్బర్, అస్గర్, శంషాద్దీన్ తదితరులు పాల్గొన్నారు.అలాగే నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు కోట రామస్వామి, శంకర్, టీఎన్జీవో నాయకులు కామ సతీష్, గిరిధర్ రావు, పట్టం శ్రీనివాస్, బోనాల రవి, నారాయణ, జీవన్ రెడ్డి, సాయి సహా వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు పరస్పరం అలైబలై తీసుకుంటూ ఆత్మీయతను పంచుకున్నారు.

## జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు

**కరీంనగర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: జిల్లాలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ వారం 3,163 మెట్రిక్ టన్నుల యూరియాను వివిధ సొసైటీలలో అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం 2,616 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, అవసరాన్ని బట్టి మరిన్ని నిల్వలు తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు.రైతులు ఆందోళన చెందనవసరం లేదని, అవసరానికి మించి కొనుగోలు చేయకుండా అవసరమైనంత మాత్రమే తీసుకోవాలని సూచించారు.



## ఘనంగా టిజిటిఏటీజీఆర్ఎస్ఏ క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ



**పెద్దపల్లి, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సంయుక్తంగా రూపొందించిన క్యాలెండర్, డైరీలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.వేణు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జే.అరుణశ్రీ పాల్గొన్నారు. టిజిటిఏ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బండి ప్రకాశ్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి.సంపత్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ దత్తు ప్రసాద్, ట్రెజరర్ ఆర్.పద్మావతి, తహసీల్దార్లు,టీజీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు డా.రాపెల్లి రాముడు, ప్రధాన కార్యదర్శి సి.హెచ్.అనిల్ కుమార్, మహిళా అధ్యక్షురాలు బి.లక్ష్మి, కోశాధికారి నుగూరి విజయ్‌తో పాటు పెద్ద సంఖ్యలో రెవెన్యూ ఉద్యోగులు హాజరయ్యారు.

## ఘనంగా ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



**కరీంనగర్ రూరల్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కొత్తపల్లి మండల స్టేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల్లో పుస్తక పఠనం, గ్రంథ పఠనం పట్ల ఆసక్తి పెంపొందించాలని సూచించారు. పాఠశాలల్లో రీడింగ్ కార్నర్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట చరిత్ర, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. పదవ తరగతి ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా పూర్వ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పిఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్రచారి, కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షులు వెలిచాల వెంకటస్వామి, తాడూరి మాధవస్వామి, సీనియర్ నాయకులు కొట్టె లక్ష్మణరావు, చాడ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



**కరీంనగర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ అర్బన్ మండలంలోని సవార్న స్ట్రీట్ సెక్టార్, సాహెతనగర నాలుగవ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీఓ సబిత, డీఎంహెచ్ఓ వెంకటరమణ మాట్లాడుతూ మహిళలు తమ సమస్యలను సభలో విన్నవించుకోవచ్చని, ప్రతి గర్భిణీ, బాలింత తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. సభలో చర్చల ద్వారా మహిళల్లో మానసిక ఉత్తేజం కలుగుతుందని, హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది హాజరుకావడం వల్ల సమస్యలు తక్షణమే పరిష్కారం అవుతాయని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యతో పాటు పిల్లల సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి కేంద్రంలో షుగర్ బోర్డు ఏర్పాటు చేసి ఆహారంలో ఉండే చక్కెర వల్ల కలిగే సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వెంకటరమణ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమంలో జిల్లాలో మహిళలకు సుమారు 50 రకాల పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్షలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజమణి, రాజేశ్వరి, బీసీ సతీష్, మెడికల్ ఆఫీసర్ పద్మజ, సిహెచ్ఎల్ సంపత్, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, ఆశా, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# సిపిఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపు



**కరీంనగర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిపిఐ 100 ఏళ్ల ఉత్సవాల సందర్భంగా ఈ నెల 4న కరీంనగర్ నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో బహిరంగ సభ జరగనుంది. సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. సభ కరపత్రాన్ని సిపిఐ జిల్లా కార్యాలయంలో విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ, 1925లో కాన్పూర్‌లో ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ వందేళ్లుగా వర్గ దోపిడీ, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తోందని తెలిపారు. స్వాతంత్ర ఉద్యమం, హైదరాబాద్ సంస్థానంలో నిజాం సర్కార్, రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో సిపిఐ అగ్రభాగాన నిలిచిందని, బద్దం ఎల్లారెడ్డి వంటి నాయకులు కరీంనగర్ గర్వకారణమని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కూడా సిపిఐ ముందుండి పోరాడిందని, ప్రజల ఆకాంక్షలను గ్రామస్థాయి నుండి ఢిల్లీ వరకు వినిపించి రాష్ట్రం సాధించేవరకు పోరాటాలు కొనసాగించిందని ఆయన గుర్తుచేశారు. సభ విజయవంతం కోసం పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు వేలాదిగా తరలివచ్చి పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సభకు జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవెన శంకర్, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ హాజరుకానున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, ఎలిశెట్టి భారతి, గామినేని సత్యం, చెంచల మురళి, మాడిశెట్టి అరవింద్, భాకం అంజన్న, బెక్కంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలు అమలు చేయాలని టిఎల్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు డిమాండ్



**కరీంనగర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కార్మికుల శ్రమ దోపిడీ విస్తృతంగా జరుగుతోందని, కార్మిక చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదని తెలంగాణ లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ తీవ్రంగా విమర్శించారు. మట్టి ఇటుక బట్టి పరిశ్రమలు, రైస్ మిల్లులు, భవన నిర్మాణ రంగం వంటి విభాగాల్లో వలస కార్మికులను తక్కువ వేతనాలతో పనిచేయించుకుంటూ వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆయన ఆరోపించారు. సామాజిక భద్రత లేకుండా అక్రమంగా కార్మికులను వినియోగిస్తున్నారని తెలిపారు. భవన నిర్మాణ రంగంలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కార్మిక సంక్షేమ బోర్డు నుండి లభించే ప్రయోజనాలు సరైన సమయంలో అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అన్ని రంగాల్లో కార్మికులను ఆదుకోవాలని, కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికుల హక్కుల కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# ఉద్యమకారులకు భూమి కేటాయించాలని డిమాండ్

**కరీంనగర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల భూమి కేటాయించాలని జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్, ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కనకం కుమారస్వామి మానకొండూర్ మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు భూమి ఇస్తామని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచినా అది నెరవేరలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల జాగృతి అధ్యక్షురాలు కవిత జాలగుట్టలో ఐదు ఎకరాలను ఉద్యమకారుల కాలనీగా కేటాయించాలని డిమాండ్ చేసిన



విషయాన్ని గుర్తుచేశారు. ఉద్యమకారులకు పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టించి ఇవ్వాలని కూడా వారు కోరారు. ఎమ్మార్వో సానుకూలంగా స్పందించి పై అధికారులకు విషయం తెలియజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాగృతి మహిళా విభాగం నాయకురాలు అక్కం శివరాణి, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, బాసవేణి రాజేందర్, యువజన నాయకుడు హుస్నాబాద్ రాజ్ కుమార్, మహిళా నాయకురాలు పోతల రూప, ఉద్యమ నాయకురాలు ఐయిల్ల ప్రసన్న, కొమ్మిడి తిరుమల, కరుపాల ను మున్న, కనుకలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్కసారలమ్మ గద్దెల నిర్మాణానికి భూమిపూజ



**గంగాధర, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలంలోని కొరటపెల్లి గ్రామంలో సమ్మక్కసారలమ్మ వెలిసినట్లు ఆనవాళ్లు కనబడటంతో, మేడారం కోయ పూజారుల ఆధ్వర్యంలో గద్దెల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మేకల మహేశ్వరి ప్రభాకర్ యాదవ్ పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో అమ్మవారు వెలువడం శుభాశుచికమని, త్వరలో జరగబోయే జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్థులు అందరూ కలసి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థులు అందరూ అమ్మవారిని దర్శించుకోవాలని కోరుతూ, జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడారం కోయ పూజారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు



**కమాన్‌పూర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అభివృద్ధికి మారుపేరు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అని కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు అన్నారు. కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయానికి ధూప, దీప, నైవేద్యాల కోసం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నిధులు మంజూరు చేయడంతో, శుక్రవారం రోజున కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిడుగు శంకర్ ఆధ్వర్యంలో శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వైనాల రాజు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, మంథనికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన ఘనత శ్రీధర్ బాబు కుటుంబానికి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు, అడబాల చంద్రయ్య, ఉప సర్పంచ్ అంబీరు రాజేందర్, ఆలయ ధర్మకర్తలు దండే సదయ్య, అరిష ఎల్లయ్య, వార్డు సభ్యుడు దామెర దేవయ్య, పిడుగు సదయ్య, వి.ఎస్.ఎస్. రాజేష్, ముకుంద శ్రవణ్, ముధం కొమురయ్య, పిడుగు పోచమల్లు, గరిగంటి సదయ్య, సింగం అశోక్, వడ్లకొండ అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# టిసిఎన్జీవోస్ జిల్లా సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



**కరీంనగర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కో-ఆపరేటివ్ డిపార్ట్మెంట్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమస్యల పరిష్కార లక్ష్యంతో పనిచేస్తున్న టిసిఎన్జీవోస్ జిల్లా సంఘం ఎన్నికలు ఈ రోజు టీఎన్జీవో భవనంలో ఏకగ్రీవంగా పూర్తయ్యాయి. ఎన్నికల ప్రక్రియను టీఎన్జీవో సంఘం కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి పర్యవేక్షించగా, పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా, ఎటువంటి విభేదాలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది. సంఘ అధ్యక్షుడిగా సర్దార్ ప్రీత్ పాల్ సింగ్, కార్యదర్శిగా సల్వాజి తిరుమల్ రావు, సహాధ్యక్షుడిగా రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, పదోన్నతులు, పని పరిస్థితుల మెరుగుదల కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కేంద్ర సంఘం నాయకుడు సర్దార్ హర్మీందర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, గెజిటెడ్ అధికారుల సంఘం నాయకుడు జలాలొద్దీన్ అక్బర్ హాజరై నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. అలాగే కో-ఆపరేటివ్ డిపార్ట్మెంట్ నాయకులు మనోజ్, కావ్య, సాజిద్, రఫీకా, వనజ, రమ్య, తహసీన్ తదితరులు పాల్గొన్నారు. ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సేవకులే నిజమైన నాయకులు. బాధ్యత తీసుకుని పనిచేస్తే మనమే నాయకులమవుతాం అని పేర్కొంటూ, ఉద్యోగులుఅధికారుల మధ్య సమన్వయం పెంపొందిస్తూ ముందుకు సాగాలని సూచించారు.

# పేదింటి పిల్ల డాక్టర్ అయిన వేల



**కమాన్‌పూర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన శ్రీహర్ష ప్రియదర్శిని వైద్య విద్యాభ్యాసం పూర్తి చేసి డాక్టర్‌గా అవతరించారు. 2021లో ఎంట్రెన్స్ పరీక్ష రాసి ర్యాంకు సాధించి, జియర్ ఇంటిగ్రేటెడ్ మెడికల్ సర్వీసెస్ హోమియోపతి కళాశాల, ముచ్చింతల్‌హైదరాబాద్‌లో బిహెచ్ఎంఎస్ చదువును ఉచితంగా పూర్తి చేశారు. నాలుగున్నర సంవత్సరాల కృషి తర్వాత పట్టా పొందారు. మట్ట మల్లేష్‌శారద దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, పెద్ద కుమార్తె శ్రీహర్ష ప్రియదర్శిని పట్టుదలతో చదివి వైద్యురాలయ్యారు. తల్లిదండ్రులు ప్రైవేట్ ఉద్యోగాల్లో ఉన్నప్పటికీ, కూతురిని డాక్టర్ చేయాలనే సంకల్పంతో చదివించి సఫలీకృతులయ్యారు. ఓ శ్రీహర్ష ప్రియదర్శిని తన వైద్య సేవలను పేదలకు ఉచితంగా అందిస్తానని సంకల్పం వ్యక్తం చేశారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**-కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. చెన్నూర్ మండలం కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. చెన్నూర్‌లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను కూడా పరిశీలించిన కలెక్టర్, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, భూభారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి త్వరగా పరిష్కరించాలని, ధ్రువపత్రాల జారీని నిబంధనలకు లోబడి వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య కలెక్టర్ వేమనపల్లి మండలం నీల్వాయి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు గదుల నిర్మాణం, వంటశాలను పరిశీలించిన కలెక్టర్ కుమార్ దీపక్, విద్యార్థులకు త్రాగునీరు, విద్యుత్, వేరువేరు మూత్రశాలలు, ప్రహరీ గోడ, పౌష్టిక ఆహారం వంటి సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించిన ఆయన, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆహారం ప్రమాణాలు పాటించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం



**కరీంనగర్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకువచ్చిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అసెంబ్లీలో తీవ్రంగా విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ గాంధీ పేరును తొలగించి కొత్త పథకాన్ని ప్రవేశపెట్టడం దుర్మార్గ చర్య అని ఆయన అన్నారు. 2005లో యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని, 2009లో మహాత్మాగాంధీ పేరును జోడించారని గుర్తుచేశారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసలు ఆగాయని, పేదలకు ఉపాధి లభించి జీవనోపాధి మెరుగుపడిందని తెలిపారు. కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టం ప్రకారం 60 శాతం వ్యయం కేంద్రం, 40 శాతం రాష్ట్రం భరించాల్సి రావడం వల్ల తెలంగాణపై 1800 కోట్ల రూపాయల భారమవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విజయరమణారావు మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్మాగాంధీ పేరును తొలగించడం అసెంబ్లీ సాక్షిగా ఖండిస్తున్నాను అని అన్నారు. గడిచిన 12 ఏళ్ల మోడీ పాలనలో ఒక్క కొత్త సంక్షేమ పథకం తీసుకురాలేదని, ఉన్న పథకాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రజల పక్షాన నిలబడకుండా బీజేపీకి భయపడి సభను వదిలి వెళ్లారని విమర్శించారు. కొత్త చట్టాన్ని రద్దు చేసి ఎన్‌ఆర్‌ఆజీఎస్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రధానిపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు.

### కలెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఎస్సిడిడి ఎంఎస్ఎ ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ లత..



**సూర్యాపేట, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** నూతన సంవత్సరం సందర్భంగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మరియు అదనపు కలెక్టర్ సీతా రామారావు లను తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ సభ్యులు కలిసి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. టీజీ ఎస్సీ డిడి ఎం ఎస్ ఏ ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ శ్రీమతి కె.లత ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కార్యాలయ సిబ్బంది శుక్రవారం జిల్లా కలెక్టర్ మరియు అడిషనల్ కలెక్టర్ లను గౌరవప్రదంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ మరియు అడిషనల్ కలెక్టర్ లను కలిసిన వారిలో శ్రీమతి లత తో పాటు టిజి ఎస్సిడిడి, ఎం ఎస్ ఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణపురం రవి వర్మ, రాధ, యాదగిరి, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కొండారెడ్డిపల్లి అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష



**నాగర్‌కర్నూలు, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆధ్వర్యంలో కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం జరిగింది. అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూరు మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదనపు కలెక్టర్ దేవ సహాయం, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గ్రామంలో ఇప్పటికే మంజూరైన పనులన్నింటిని ప్రత్యేకంగా పరిశీలించి, గతంలో ప్రారంభించి ఇంకా మిగిలి ఉన్న పనులను జనవరి 30 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా మంజూరైన పనులపై టెండర్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని, గడువులో ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి శాఖ అధికారులు తమ పరిధిలోని పనులపై సమగ్ర నివేదికలు సమర్పించాలని, మిగిలి ఉన్న పనులను తక్షణమే ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యత అంశమని, అన్ని పనులు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చూడాలని ఆయన ఆదేశించారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులను నిర్మాణ పనులను అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని సూచిస్తూ, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపడేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, డీఈఓ రమేష్ కుమార్, పంచాయతీ రాజ్ ఈఈ విజయ్, మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ సింగ్, వంగూరు తాహసిల్దార్, వంగూరు ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో వెలిగించిన సమానత్వ దీపం




సావిత్రీబాయి పూలే 195వ జయంతి సందర్భంగా సావిత్రీబాయి పూలేను స్మరించుకుంటూ, ఆమె జీవితాన్ని సమానత్వం, విద్య, మానవత్వానికి అంకితం చేసిన మహోన్నత సంఘ సంస్కర్తగా గుర్తిస్తున్నారు. 1831 జనవరి 3న మహారాష్ట్రలో జన్మించిన సావిత్రీబాయి, బాల్యం నుంచే కుల, లింగ వివక్షలను ప్రశ్నించారు. భర్త జ్యోతిరావ్ పూలే ప్రోత్సాహంతో విద్యావంతురాలై, 1848లో పుణేలో బాలికల కోసం తొలి పాఠశాలను ప్రారంభించారు. రాళ్లు విసరడం, అవమానించడం వంటి ప్రతిబంధకాలను ఎదుర్కొన్నప్పటికీ వెనక్కి తగ్గకుండా, విద్యే విముక్తికి మార్గమని సమాజానికి చూపించారు. జీవితకాలంలో 52 పాఠశాలలను స్థాపించి, బాలికల విద్యా విప్లవానికి పునాది వేశారు. విధవ మహిళల పునర్వివాహానికి మద్దతు, బాల్యవివాహాలకు వ్యతిరేక పోరాటం, ఆశ్రయ గృహాల ఏర్పాటు వంటి సామాజిక సంస్కరణల్లో ముందుండి పనిచేశారు. “స్త్రీ విముక్తి లేకుండా సమాజ అభివృద్ధి అసాధ్యం” అనే సందేశాన్ని ఆమె తన జీవితంతో నిరూపించారు. సత్యశోధక్ సమాజ్ ద్వారా అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం నేర్పి, సమానత్వం హక్కు అని ప్రజలకు తెలియజేశారు. 1897లో ప్లేగ్ వ్యాధి సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా సేవ చేసి, మానవత్వమే నిజమైన ధర్మమని చూపించారు. ఆమె వారసత్వం నేటికీ ప్రాసంగికమే. బాలిక చదువుకుంటే కుటుంబం మారుతుంది, కుటుంబం మారితే సమాజం మారుతుంది, సమాజం మారితే దేశం అభివృద్ధి చెందుతుంది. స్మరణ వాక్యం:“సావిత్రీబాయి పూలే విద్య వెలుగును వెలిగించిన తొలి దీపం.”

వ్యాసకర్త
**వేల్పుల మహేందర్, ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంఈడి
అధ్యాపకులు, కింగ్‌స్టన్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్,
పొన్నాల, సిద్దిపేట**



### గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ సందర్శన ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు




**యాచారం, జనవరి 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ యాచారం మండలం మేడిపల్లి వద్ద ఉన్న హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన, సిబ్బందితో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌లో ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అప్రమత్తంగా ఉండాలని, చట్టవ్యవస్థల పరిరక్షణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మహిళలు, పిల్లల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ స్పష్టం చేశారు. అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా కృషి చేయాలని ఆయన సిబ్బందిని ప్రోత్సహించారు. ఈ సందర్శనలో గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ బి. సత్యనారాయణ, ఎస్ఐ సైదులు, ఎస్ఐ వంశీతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

**- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



**ఆమనగల్లు, జనవరి 2 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. వెల్దండ మండలం నారాయణపూర్ తండాకు చెందిన రాట్లావత్ మధు ఇల్లు ఇటీవల పూర్తిగా విద్యుత్ ఘాతంతో దగ్ధమైంది. శుక్రవారం సంఘటన స్థలాన్ని ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి సందర్శించి, బాధితుని పరామర్శించి రూ. 5000 రూపాయలు అందజేశారు. అగ్ని ప్రమాద సంఘటనపై ప్రభుత్వం స్పందించి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనిల్ కుమార్, అంజి నాయక్, శ్రీను, కృష్ణ, రవిలు పాల్గొన్నారు.

# ఈవీఎంల పనితీరుపై కర్నాటకలో సర్వే..

## రిపోర్టును తిరస్కరించిన రాష్ట్ర మంత్రి



**బెంగుళూరు జనవరి 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల పై ఓటర్లలో విశ్వాసం అన్న అంశంపై కర్నాటకలో ఇటీవల సర్వే నిర్వహించారు. ప్లానింగ్ అండ్ స్టాటిస్‌టిక్స్ శాఖ ఆధ్వర్యంలో నడిచే కర్నాటక మానిటరింగ్ అండ్ ఎవాల్యుయేషన్ అథారిటీ ఆ సర్వే చేపట్టింది. సుమారు 5100 మంది ఓటర్ల నుంచి అభిప్రాయాలను సేకరించారు. అయితే 85 శాతం మంది ఓటర్లు ఈవీఎంలపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించినట్లు తెలిపారు. ఆ సర్వే రిపోర్టు ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ మధ్య ఘర్షణకు దారి తీసింది.ప్లానింగ్ అండ్ స్టాటిస్‌టిక్స్ శాఖ నిర్వహించిన సర్వేతో తమకు సంబంధం లేదని కర్నాటక ప్రభుత్వం చెబుతోంది. కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నట్లు బీజేపీ ఆరోపించింది. ఓటు చోరీ జరుగుతున్నట్లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలు నిజం కాదు అని బీజేపీ నేత బీవై విజయేంద్ర తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. సర్వే నివేదిక ద్వారా ఆ విషయం స్పష్టం అవుతోందన్నారు. కానీ ఆ సర్వేకు అనుమతి ఇవ్వలేదని కర్నాటక ఐటీశాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే అన్నారు. పీఎంవో ఆఫీసుతో లింకున్న ఓ వ్యక్తికి చెందిన ఎన్జీవో సంస్థ ఆ సర్వే చేపట్టినట్లు ఖర్గే తెలిపారు.

# పెండ్లికి ముందే సెక్స్ చేస్తే జైలుకే

## సహజీవనం చేసినా శిక్ష
## ఇండోనేషియాలో అమలు



**న్యూఢిల్లీ జనవరి 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెండ్లికి ముందే సెక్స్ చేయడం లేదా సహజీవనం చేయడం శిక్షించదగిన నేరంగా పేర్కొంటున్న చట్టం ఇండోనేషియాలో అమల్లోకి వచ్చింది. దీనికి సంబంధించిన బిల్లును 2022 డిసెంబర్‌లో పార్లమెంటు ఆమోదించింది. మూడేండ్ల తర్వాత శుక్రవారం నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చింది.ఈ మూడేండ్లలో ఈ చట్టం గురించి ప్రజలకు, పోలీసులకు శిక్షణ ఇచ్చారు. వివాహేతర సంబంధాలు పెట్టుకుని, సెక్స్ చేస్తే, దోషులకు ఒక ఏడాది జైలు శిక్ష విధించవచ్చునని ఈ చట్టం చెప్తున్నది. పెండ్లి కాకుండానే సహజీవనం లేదా కలిసి జీవించడం చేస్తే ఆరు నెలల జైలు శిక్ష విధించవచ్చునని పేర్కొన్నది.

# యెమెన్‌పై సౌదీ దాడులు.. ఏడుగురు మృతి



**రియాద్: జనవరి 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యెమెన్ సంక్షోభం రోజురోజుకూ ముదురుతున్నది. యూఏఈ మద్దతున్న వేర్పాటువాదుల శిబిరాలను లక్ష్యంగా చేసుకుని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు శుక్రవారం జరిపిన వైమానిక దాడుల్లో ఏడుగురు మరణించగా, 20 మందికి పైగా గాయపడ్డారు.హద్రమౌత్ ప్రావిన్స్‌లోని అల్-ఖసా ప్రాంతంలోని మిలిటరీ శిబిరం లక్ష్యంగా కూడా ఈ దాడులు జరిగినట్టు హద్రమౌత్‌లోని సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ హెడ్ అబ్దుల్ మాలిక్ పేర్కొన్నట్టు ఏఎఫ్‌పీ వార్తా సంస్థ తెలిపింది. సౌదీతో సరిహద్దును పంచుకుంటున్న హద్రమౌత్‌లోని వేర్పాటు వాదుల శిబిరాలను, ఆ ప్రాంతాన్ని నియంత్రణలోకి తెచ్చుకునేందుకు సౌదీ అరేబియా ప్రయత్నిస్తున్నది.

# సావిత్రిభాయి పూలే - సామాజిక సేవ

**(జనవరి 3న జన్మదినాన్ని పురస్కరించుకొని)**




19వశతాబ్దపుకాలంలో బ్రాహ్మణాధిపత్యం కొనసాగుతున్నప్పుడు సమాజంలో బహుజనకులాలకు చెందిన పురుషులు చదువుకోకూడదనే బ్రహ్మణవాద మతగ్రంధాలు శాసిస్తున్నప్పుడు అలాగే బ్రహ్మణకులానికి చెందిన మహిళలు సైతం చదువుకోకూడదనిచెప్పే ధర్మశాస్త్రాలున్నప్పుడు ఇక దళితబహుజన మహిళల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అంచనా వేయవచ్చు.నిరక్షరాస్యతతోపాటు అజ్ఞానం,మూఢనమ్మకాలు బహుజనసమాజాన్ని పట్టిపీడిస్తున్న కాలంలో సావిత్రిబాయి 1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా ఖండాల ప్రాంతంలో గల శిఖాల గ్రామానికి 5కిలోమీటర్ల దూరంలో గల నయగావ్ గ్రామంలో 'మాలీ' కులంలోని నిరుపేద కుటుంబంలో లక్ష్మీబాయి,ఖండూజీ నవసే పాటిల్ దంపతులకు జన్మించింది.చిన్నప్పటి నుండే సావిత్రిబాయికి ముక్కుసూటితనం ఎక్కువ,అబద్ధమాడకుండా ఉంటూ,ఇతరులను అవమానించడమంటే గిట్టదు,అలాగే చలాకితనం,చురుకుతనం,తెలివితేటలు కలిగిన సావిత్రిబాయి అందరిలో ఆకర్షణగా ఉంటూ 6 సంవత్సరాల వయసునుంచే పొలంపనులు చేయడం,పశుసంరక్షణ,పాలుపితకడం నేర్చుకుంది.తనకు చెరువులో ఈతకొట్టడం అంటే ఎంతో సరదా. 1840లో తొమ్మిదిసంవత్సరాల సావిత్రికి పన్నెండేళ్ల జ్యోతిరావుతో పెళ్లి జరిగింది.భర్త సహకారంతో 1841లో విద్యను ఆరంభించిన సావిత్రికి ఎన్నోఅవరోధాలు,అంతరాయాలు ఏర్పడ్డాయి.ఆమె పాఠశాలకు వెళ్లే మార్గమధ్యలో అగ్రవర్ణాలవారు అక్కసు తీర్చుకోవడానికి ఆమెపై పేడనీళ్లు చల్లేవారు.అందుకే ఒకసంచిలో మరొకజత బట్టలుపెట్టుకొని ప్రాథమికవిద్యను పట్టుదలతో పూర్తిచేయగలిగింది.నిరక్షరాస్యులుగా ఉన్న సావిత్రిబాయి అక్షరాస్యులుగా మారడమే ఆమె చరిత్రలో ఆదర్శమూర్తి కావడానికి దోహదపడిందని చెప్పవచ్చు.సావిత్రిబాయి విద్యను నేర్చుకోవడానికి గల ముఖ్యకారణం,దేశ వెనకబాటుతనానికి గలకారణం జనాభాలో 50శాతమున్న మహిళలు నిరక్షరాస్యులుగా ఉండటమేనన్న సత్యాన్ని గ్రహించిన జ్యోతిరావుపూలే తనభార్యను మహిళలకు విద్యనేర్పించడానికి పూనుకున్నారు.1847లో తన ఆడపడుచు సుగుణభాయ్ తో కలిసి మహర్ దళితవాడలో పాఠశాల ప్రారంభించి ఉపాధ్యాయురాలిగా మారింది.భారతదేశంలో సావిత్రిబాయి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు కావడం ఒక విప్లవాత్మకమైన చర్యగా భావించవచ్చు.స్త్రీలకోసం దేశంలోనే ప్రప్రథమంగా పాఠశాల ప్రారంభించి,విద్యావ్యాప్తిద్వారా వారిని దాస్యవిముక్తి చేసేందుకు,కులవివక్షత,సామాజిక దోపిడీని నివారించేందుకు సాధ్యమని పూలేదంపతులు తలిచి కార్యసాధనకు కారకులయ్యారు.దేశంలో మహారుషి కార్వే తొలి మహిళా విశ్వవిద్యాలయం స్థాపించకముందే,తొలి మహిళాపాఠశాలను నడిపిన మహావ్యక్తి సావిత్రిబాయిపూలే.1848 జనవరి 7న దేశంలో ప్రప్రథమ బాలికల పాఠశాలను పూణేలోని బీట్స్ వాడలో ఏర్పాటుచేసి దానికి ప్రధానోపాధ్యాయురాలుగా వ్యవహరించారు.1849లో శూద్ర - అతిశూద్రలకు పూణేలోని ఉస్మాన్ షేక్ వాడలో వయోజనపాఠశాల ఏర్పాటుచేసి వారికి విద్యాబోధన చేసినందుకుగాను పూలేదంపతులు ఇంటినుంచి బహిష్కరించబడ్డారు.మహాత్మపూలే స్థాపించిన పాఠశాలలన్నింటిని తీర్చిదిద్ది వాటిని విజయపథంలో నడిపించడంలో సావిత్రిబాయి కృషి అనన్యసామాన్యమైనదిగా చెప్పవచ్చు.1920నుంచే భారతదేశంలో ఖాదీ ఉద్యమం ప్రారంభమైందని అనుకుంటున్నాము కానీ అంతకుముందే ఖాదీ ధరించి దిశానిర్దేశం చేసింది సావిత్రిబాయిపూలే దంపతులు.ఈమె మహిళలలో చైతన్యం పెంపొందించి,అంటరానితనం నిర్మూలించి,స్త్రీల సమస్యల పరిష్కారంకోసం "మహిళా సేవాసంస్థ"ను ప్రారంభించారు. మకరసంక్రాంతి సందర్భంగా మహారాష్ట్ర ప్రజలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకోవడం కోసం 1852 జనవరి 14న తిలగుండ్ సమారోహి మహిళా సేవామండలి సంస్థలను ఏర్పాటుచేసింది.సావిత్రిబాయిపూలే తాముస్థాపించిన పాఠశాల బాగోగులను గమనిస్తూ,పాఠశాల వార్షికసమావేశాలను తన ఆధ్వర్యంలోనే జరిపించేవారు.1853 జనవరి 12న అన్నిపాఠశాలలకు కలిపి ఒక బహుమతివేడుక సభను జరిపితే,దీనికి రెండువేలకుపైగా మహిళలు హాజరయ్యారు.ఈ సభలో కలెక్టర్ సతీమణి మిస్సెస్ జోన్స్ తన ప్రసంగంలో పూలేదంపతులను ఎంతగానో ప్రశంసించారు. దేశంలో ఆధిపత్యకులాల అంధవిశ్వాసాల వల్ల,మూఢనమ్మకాల వలన దళితబహుజన స్త్రీలు సమాజంలో అత్యంత కఠినమైన అణచివేతకు గురయ్యేవారు.బాల్యంలో లేదా యవ్వనంలో ఒక స్త్రీ వితంతువయితే ఆమెపై జరిగే అత్యాచారాలకు అంతేలేదు.గర్భవతులైన వితంతువులు గర్భస్రావం చేసుకోవడానికి అనుసరించే పద్ధతులవలన ఒక్కొక్కసారి ప్రాణాలుకూడా వదిలేవారు.గర్భస్రావం విఫలమైన పరిస్థితులలో మృతశిశువులకు జన్మనివ్వవలసి వచ్చేది లేదా జన్మించిన శిశువును హత్యచేయవలసి వచ్చేది.అలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి వితంతువులకు ఆశ్రయమిచ్చేందుకు "బాలహత్య ప్రతిబంధక" గృహాన్ని సావిత్రిబాయి నేతృత్వంలో 1853 జనవరి 28 న పూలే ప్రారంభించారు.ఎవరైనా బాలవితంతువు దురదృష్టవశాత్తు అత్యాచారానికి గురై బిడ్డకు జన్మనిస్తే ఇక్కడ వదిలివెళ్లేవారు.1873 వరకు ఇక్కడ 66 మంది శిశువులు జన్మించారు.అందులో యశ్వంత్ అనే బాలుడిని పిల్లలులేని పూలేదంపతులు దత్తత తీసుకోవడం గమనార్హం. 1863లో అనాధలకు పాఠశాల ఏర్పాటుచేసి విద్యనందించారు.కాశీభాయ్ అనే బ్రాహ్మణ వితంతువు కుమారుని 1874లో పూలే దంపతులు దత్తతతీసుకున్నారు.1876 - 77లో మహారాష్ట్రలో కరువు ఏర్పడి ప్రజలు ఇక్కట్లు పడుతున్నప్పుడు 52 ఉచిత భోజన వసతిగృహాలను ఏర్పాటుచేసి నిరాశ్రయులకు ఆరాధ్యదేవతలుగా మారారు. సావిత్రిబాయి నిస్వార్థసేవ వలన కేవలం శూద్ర,అతిశూద్ర సమాజంలోనే గాక యావత్ మహారాష్ట్రసమాజంలో ఆమె పేరుప్రఖ్యాతులు మారుమ్రోగాయి.ఆమే సామాజిక సేవకు సహాయమందించేందుకు పలువురు ముందుకు వచ్చారు.కానీ ప్రశంసలతోపాటు విమర్శలను కూడా ఎదుర్కొవాల్సి వచ్చింది.వీధుల్లోకి వచ్చి అంటరాని బాలికలకు విద్యనేర్పడం చెడ్డపని అని,సమాజాన్ని అల్లకల్లోలంచేస్తూ ధర్మవిరుద్ధంగా ప్రవర్తిస్తుందని అగ్రవర్ణాలవారు గగ్గోలుపెడుతూ,సావిత్రిబాయిని సమాజం నుండి బయటికి వెలివేయాలని బాహాటంగానే చెప్పేవారు.కానీ స్త్రీవిద్య,సమాజసేవ అనే ఉన్నతలక్ష్యాల ముందు వారివిమర్శలు నిలువలేదు. 1890లో 63 ఏళ్ళ వయసులో మహాత్మపూలే మరణించాక తానే స్వయంగా చితికి నిప్పు అంటించి తనభర్త చెప్పినమాటలను గుర్తుచేసుకుని తనభర్త కన్న కలలను సాకారం చేయడానికి సంస్థలన్నింటినీ నడిపేబాధ్యత స్వీకరించి,వాటిని అభివృద్ధి పథంలోకి నడిపించిండం ఆమే ధైర్యానికి నిదర్శనమని చెప్పకతప్పదు.1896లో మహారాష్ట్రలో వచ్చిన భయంకరమైన కరువువలన ప్రజలు ఆకలితో అలమటిస్తున్నప్పుడు పునరావాస కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని మహారాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది.1897లో పూణేలో ప్లేగువ్యాధి వ్యాపించినప్పుడు తాను ప్రత్యక్షంగా పాల్గొని వ్యాధిగ్రస్తుడైన పిల్లలకు సేవచేస్తూ పాండురంగ బాలాజీ గైక్వాడ్ అనే మాండ్వా గ్రామస్తుడైన బాలుడి ద్వారా ప్లేగువ్యాధి బారినపడి 1897 మార్చి 10న మరణం పొందారు.ఈ తేదీని పురస్కరించుకొని మహారాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయిపూలే గౌరవార్థం శతవర్ధంతి సందర్భంగా "తపాలా బిళ్ళను" ముద్రించడం ఒక్కేత్తయితే సావిత్రిబాయిపూలే అభిమానులు "బోధిసత్వ రాష్ట్రమాతగా" అభివర్ణించారు.ఆమే లక్ష్యనెరవేరణకు ఎన్ని అవరోధాలు ఎదురైనా ఏమాత్రం చలించని మహాసాధ్వి,మానవసేవయే మాధవసేవ అనేవిధంగా తనజీవితాన్ని త్యాగంచేసిన గొప్ప మహిళమూర్తిగా నిలిచింది.సమాజం,కుటుంబ బహిష్కరణ నడుమ సావిత్రిబాయి మహిళావిద్య ఉద్యమాన్ని సాహసోపేతంగా నడిపించి విజయం సాధించినందుకు నేడు మహిళలు,దళితబాలికలనే తారతమ్యం లేకుండా సమస్త మహిళాలోకం ఆమేను ఆదర్శంగా తీసుకుంటూ,పోరాటపఠిమతో అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆశిద్దాం.

వ్యాసకర్త
డా.పోలం సైదులు,
తిరుమలగిరి,వంగూర్ మండలం,
9441930361.



# 11మంది తమిళనాడు మత్స్యకారుల అరెస్ట్



**కొలంబో జనవరి 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తమిళనాడుకి చెందిన 11మంది మత్స్యకారులను అరెస్ట్ చేసినట్లు శ్రీలంక నేవీ శుక్రవారం పేర్కొంది. వారి బోటును కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. ఉత్తర ప్రావిన్స్‌లో కంకేసంతురైకి ఉత్తరాన గురువారం అర్ధరాత్రి మత్స్యకారులను అరెస్ట్ చేసినట్లు శ్రీలంక నేవీ అధికార ప్రతినిధి కమాండర్ బుద్ధిక సంపత్ తెలిపారు. వారు తమ జలాల్లో అక్రమంగా వేటాడుతున్నారని, హెచ్చరించినా వెనక్కి వెళ్లలేదని అన్నారు.

# మంచిరెడ్డి కిషన్ రెడ్డి కి నూతన సంవత్సరం శుభాకాంక్షలు

**యాచారం ,**
జనవరి 02 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) నూతన సంవత్సరం సందర్భంగా బి ఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు , ఇబ్రహింపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి , బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి నీ స్వగృహంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మేడిపల్లి మాజీ ఎంపీటీసీ , గ్రామాజ డైరెక్టర్ మక్కపల్లి స్వరూప, శ్రీనివాస్, బి ఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.





# రూ.10 సర్వీస్ చార్జ్‌కు 50 వేల జరిమానా



**ముంబై, -జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

భోజన బిల్లులో సర్వీస్ చార్జీని వసూలు చేసిన ముంబైలోని ఒక రెస్టారెంట్‌కు సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ రూ.50,000 జరిమానా విధించింది. బోరా రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్న చైనా గేట్ రెస్టారెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ జరిమానా చెల్లించాలని ఆదేశించారు.ముంబై నివాసి ఒకరు ఏప్రిల్‌లో బోరా రెస్టారెంట్‌కు వెళ్లి భోజనం చేశారు. అసలు ఆర్డర్ మొత్తం, +దూపై 10 శాతం సర్వీస్ చార్జీని వసూలు చేశారు. దీనిపై ఆయన యాజమాన్యాన్ని ప్రశ్నించి, దానిని తీసివేయాలని కోరగా, వారు దానికి నిరాకరించారు. దీంతో ఆయన అథారిటీకి ఫిర్యాదు చేశారు.

# వాట్సాప్ ద్వారా న్యాయ సేవలు ప్రారంభించిన కేంద్రం



**న్యూఢిల్లీ:-జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ప్రజలకు న్యాయ సహాయాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం న్యాయ సేతు సేవలను వాట్సాప్‌లో గురువారం అందుబాటులోకి తెచ్చింది. వాట్సాప్ మెసేజ్ ద్వారా న్యాయ సేతు నుంచి ఉచితంగా న్యాయ సేవలను పొందవచ్చునని కేంద్ర న్యాయ శాఖ తెలిపింది. ఈ అప్‌డేట్ వల్ల ప్రతి పౌరునికి వృత్తిపరమైన న్యాయ సహాయం ఎల్లప్పుడూ వేగంగా, అందుబాటులో ఉంటుందని తెలిపిందిన్యాయ సేతు యాప్‌ను భారత ప్రభుత్వం 2024 ఆగస్టులో ప్రారంభించింది. ప్రజలకు న్యాయ సహాయం మరింత మెరుగ్గా అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో దీనిని తీసుకొచ్చింది. సంక్లిష్టమైన బ్యూరోక్రాటిక్ ప్రాసెస్‌ల ద్వారా అన్వేషించవలసిన అవసరం లేకుండా, ప్రజలు వేగంగా మార్గదర్శకత్వాన్ని పొందే విధంగా దీనిని తీర్చిదిద్దారు. 7217711814 నంబర్‌కు మెసేజ్ చేసి సేవలు పొందొచ్చు.

# ప్రపంచంలో తొలి మల్టీనేషనల్ వర్సిటీగా ఐఐటీ మద్రాస్!




**చెన్నై - జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ప్రపంచంలో తొలి మల్టీనేషనల్ యూనివర్సిటీగా ఎదిగేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), మద్రాస్ ప్రయత్నిస్తున్నది. ఈ వ్యూహంలో భాగంగా ఐఐటీఎం గ్లోబల్ అనే ఇంటర్నేషనల్ రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ప్లాట్‌ఫాంను శుక్రవారం ప్రారంభించింది.దీనిని విదేశాంగ మంత్రి జైశంకర్ చెన్నై క్యాంపస్‌లో ప్రారంభించారు. విదేశాల్లో పరిశోధనలు, అకడమిక్, స్టార్టప్ కొలాబరేషన్లను విస్తరించాలనే విస్తృత వ్యూహంలో భాగంగా ఐఐటీఎం గ్లోబల్‌ను ప్రారంభించారు. దీని ద్వారా పరిశోధన, ప్రతిభ, పరిశ్రమలు, స్టార్టప్‌లలో పరస్పర సహకారాన్ని ప్రోత్సహిస్తారు. భారత దేశ దేశీయ వ్యవస్థలోకి గ్లోబల్ ప్రాజెక్టులు, పెట్టుబడులను తిరిగి తీసుకొస్తారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన రైతు కమిషన్ బృందంకమిషన్ పనితీరుపై సీఎం ప్రశంసలు





**హైదరాబాద్, జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

రాష్ట్ర రైతాంగ సంక్షేమం దిశగా రైతు కమిషన్ చేపడుతున్న కార్యక్రమాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి నేతృత్వంలోని బృందం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసింది. కమిషన్ ఏర్పాటు అనంతరం చేపట్టిన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పర్యటనలు, విధానపరమైన సూచనలను సీఎం సమీక్షించారు.కమిషన్ ఊహించినదానికంటే మెరుగ్గా పనిచేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసించారు. రైతుల్లో మరింత అవగాహన కల్పించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా పంట మార్పిడి విధానం, సేంద్రియ వ్యవసాయం, ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించే బాధ్యతను కమిషన్ స్వయంగా తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేపట్టాలని, అవసరమైతే అదనపు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.తెలంగాణలో తృణధాన్యాలు, పప్పుదినుసుల సాగు తగ్గుముఖం పట్టడంపై ఆందోళన వ్యక్తం చేసిన సీఎం, వాటిని కాపాడుకునే దిశగా ప్రత్యేక చర్యలు అవసరమని సూచించారు. సాంప్రదాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం విధానపరమైన ఆలోచన చేస్తోందని తెలిపారు. వరికి ఇస్తున్నట్లుగానే, అవసరమైతే ఇతర పంటల వైపు వెళ్లే రైతులకు కూడా ప్రోత్సాహకాలు అందించే అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేశారు.ఇదే సందర్భంగా కమిషన్ చైర్మన్, సభ్యులు కేరళ, హర్యానా పర్యటనల వివరాలను సీఎంకు వివరించారు. ఉద్యానవన పంటల సాగు, కూరగాయల మార్కెటింగ్ విధానంలో కేరళ పాలసీ ప్రభావవంతంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేలా కమిషన్ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కౌలు రైతు విధానం, ఉద్యానవన పంటల ప్రోత్సాహంపై కేరళ నమూనాను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.కమిషన్‌లో రైతుల ఆలోచనలు, అనుభవాలు తెలిసిన వారే సభ్యులుగా ఉండటం వల్లే ఈ స్థాయిలో పనితీరు కనిపిస్తోందని సీఎం మరోసారి పేర్కొన్నారు. నూతన సంవత్సర సందర్భంగా రైతు కమిషన్ బృందం సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి జన్మదినం అని తెలిసిన వెంటనే సీఎం ఆయనకు ప్రత్యేకంగా బర్త్‌డే విషెస్ తెలిపారు.ఈ సమావేశంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో పాటు సభ్యులు కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, భూమి సునీల్, భవానీ రెడ్డి, కమిషన్ మెంబర్ సెక్రటరీ గోపాల్ పాల్గొన్నారు.

# ఫుడ్ పాయిజనింగ్ వల్ల.. 200 చిలుకలు మృతి

**భోపాల్ జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

కలుషిత ఆహారం వల్ల సుమారు 200 చిలుకలు మరణించాయి. ఇది చూసి స్థానికులు భయాందోళన చెందారు. బర్డ్ ఫ్లూ కారణంగా చిలుకలు చనిపోయినట్లు అనుమానం వ్యక్తం చేశారు. అయితే చిలుకల మృతికి ఫుడ్ పాయిజనింగ్ కారణమని పశువైద్యులు నిర్ధారించారు. మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బద్వా ప్రాంతంలోని నర్మదా నది ఒడ్డున ఉన్న అక్విడక్ట్ వంతెన సమీపంలో గత నాలుగు రోజుల్లో సుమారు 200 చిలుకలు మరణించాయి. ఇది చూసి స్థానికులు ఆందోళన చెందారు. బర్డ్ ఫ్లూ సోకడం వల్ల చిలుకలు చనిపోయినట్లు అనుమానం వ్యక్తం



చేశారు.కాగా, వందలాది చిలుకలు మరణించిన సమాచారం తెలుసుకుని పశువైద్యులు, వన్యప్రాణుల సంరక్షణ శాఖతో పాటు అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. చిలుకల కళేబరాలకు పోస్ట్‌మార్టం నిర్వహించారు. వాటి మృతికి ఫుడ్ పాయిజనింగ్ కారణమని పశు వైద్యులు నిర్ధారించారు. బర్డ్ ఫ్లూ వైరస్ ఆనవాళ్లు కనిపించలేదన్నారు. మరింత పరీక్ష కోసం చిలుకల నమూనాలను జబల్పూర్ ల్యాబ్‌కు పంపినట్లు అధికారులు వెల్లడించారు.మరోవైపు పొలాల్లో పురుగు మందులు స్ప్రే చేసిన ఆహార గింజలు తినడం, నర్మదా నదిలోని కలుషిత నీరు, సందర్శకులు వదిలేసిన మిగిలిన ఆహారం తినడం వల్ల చిలుకలకు ఫుడ్ పాయిజనింగ్ జరిగి ఉంటుందని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్విడక్ట్ వంతెన సందర్శించే వారు పక్షులకు ఆహారం ఇవ్వడాన్ని నిషేధించారు. దీనిని కఠినంగా అమలు చేసేందుకు ఆ ప్రాంతంలో సిబ్బందిని నియమించారు.

# మరోసారి బహిరంగంగా కనిపించిన కిమ్ కుమార్తె

**న్యూఢిల్లీ:-జనవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ కుమార్తె కిమ్ జు యే కు ఆ దేశంలో ప్రాధాన్యత పెరుగుతోంది. గత మూడేళ్లుగా తండ్రి కిమ్‌తో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ కిమ్ జు యే అంతర్జాతీయ మీడియాను ఆకర్షిస్తున్నారు. ఆమెను కిమ్ వారసురాలిగా స్థానిక మీడియా పేర్కొంటోంది.ఈ నేపథ్యంలో కిమ్ జు యే తాజాగా మరోసారి బహిరంగంగా కనిపించారు. తన తల్లిదండ్రులతో కలిసి దేశ మాజీ నేతల స్మారక ప్రదేశం 'కుమ్‌సుసన్' స్మారకాన్ని ఆమె సందర్శించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని దేశ మాజీ నాయకులకు నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమానికి పలువురు సీనియర్ అధికారులు కూడా హాజరయ్యారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు వీడియోలు వైరల్‌గా మారాయి.2009లో రి సోల్ జుతో కిమ్‌కు వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. అయితే,



ముగ్గురు పిల్లల్లో కేవలం కుమార్తె జు యే గురించి మాత్రమే బయట ప్రపంచానికి తెలిసింది. ఆమె అంటే కిమ్‌కు చాలా ఇష్టమట. 2022లో తొలిసారి జుయేని కిమ్ ప్రపంచానికి పరిచయం చేశారు. అప్పటి నుంచి తండ్రితోపాటూ పలు అధికారిక కార్యక్రమాల్లో జుయే మెరిశారు.ఇటీవలే ఆమెను తొలిసారి విదేశీ పర్యటనకు కూడా తీసుకెళ్లారు కిమ్. గతేడాది సెప్టెంబర్ 2న చైనా పర్యటనకు తీసుకెళ్లారు. చైనా విజయోత్సవాల సందర్భంగా జరిగిన సైనిక కవాతుకు వీరు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పాల్గొన్నారు. ఇలాంటి హై ప్రొఫైల్ ఈవెంట్‌లో ఆమె పాల్గొనడాన్ని బట్టి కిమ్ జోంగ్ ఉన్‌కు భావి వారసురాలిగా ఆమెను పరిచయం చేస్తున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఉత్తర కొరియాకు కాబోయే నేత ఆమే అన్న సందేహాలు నెలకొన్నాయి.